KANCHARLA
# మనసులో మాట
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
శుక్రవారం 29 మే 2026



## జూన్ 2ను ఆర్టీసీ విలీనం డేగా ప్రకటించాలి

- ఎంపిలను కలిసి విన్నవించిన జెఎసి నేతలు
- ఆర్టీసీ విలీనంపై స్పష్టత కోరుతూ 1న ఇందిరాపార్క్ వద్ద దీక్ష
- తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రకటన

4



# ప్రతి పౌరుడికీ 'సమగ్ర సంక్షేమ కార్డు'..

- సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం!
- ఒకే కార్డులో అన్ని పథకాల చిట్టా..
- అర్హుల వేటలో 'ఏఐ' సాంకేతికత
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అన్నీ ఒకే చోట
- డేటా సేకరణకు స్పెషల్ డ్రైవ్..

గల్ఫ్ వలసలపై కేరళ మోడల్ అధ్యయనానికి ఆదేశం

2



## ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి



- డబ్బా ఇళ్లు కాదు..డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది
- పొంగులేటి సవాల్‌పై కెటిఆర్ ప్రతిసవాల్

05

## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

3



- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబుల వెల్లడి

## ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా

- ఎఫ్‌సిఐ ద్వారా ఎందుకు కొనరో చెప్పాలి
- బిజెపి నేతలపై మండిపడ్డ మంత్రి అడ్లూరి

3



## ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

- కావాలనే యాగీచేస్తున్న పలువురు నేతలు
- ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయన్న ఉత్తమ్



2

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చివరి ధాన్యం గింజవరకు కొంటాం
- మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి

2



## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చివరి ధాన్యం గింజవరకు కొంటాం
- మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి



మంచిర్యాల,(మనసులో మాట) : తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. చివరి ధాన్యం గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని పేర్కొన్నారు. గురువారం చెన్నూరు మండలం బావురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. పెద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హామాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40 లారీలను కేటాయించామని అన్నారు. మొత్తం 80 లారీలతో త్వరలోనే రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొని మిల్లులకు తరలిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## తెలంగాణకు చల్లని కబురు

### రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం

హైదరాబాద్,మే28: తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# ప్రతి పౌరుడికీ 'సమగ్ర సంక్షేమ కార్డు'..

- సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం!
- ఒకే కార్డులో అన్ని పథకాల చిట్టా..
- అర్హుల వేటలో 'ఏఐ' సాంకేతికత
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అన్నీ ఒకే చోట
- డేటా సేకరణకు స్పెషల్ డ్రైవ్..

గల్ఫ్ వలసలపై కేరళ మోడల్ అధ్యయనానికి ఆదేశం



హైదరాబాద్ (మనసులో మాట): రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే గొడుగు కిందికి రానున్నాయి. లబ్ధిదారుల ప్రొఫైల్ మొత్తం ఒకే చోట లభ్యమయ్యేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా 'సమగ్ర సంక్షేమ కార్డు' రూపకల్పనకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఏ పౌరుడికి, ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద ఎంత లబ్ధి చేకూరుతుందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా విధివిధానాలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి గురువారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.

### 'ఏఐ' సాంకేతికతతో అర్హుల వేట..

సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో విశ్లేషించడం ద్వారా పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ విధానం వల్ల నిజమైన పేదలకు, అర్హులకు పథకాలు కచ్చితంగా చేరుతాయని.. అదే సమయంలో ఒకే వ్యక్తి రెండు, మూడు పథకాలు పొందుతూ ఇతరుల హక్కులను కాలరాసే అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి స్వస్తి పలికి, ఐటీ శాఖ ఆధ్వర్యంలోనే ఈ సమగ్ర కార్డును రూపొందించాలని, దీనికోసం టెక్నాలజీపై పట్టున్న యువ అధికారులను ఉపయోగించుకోవాలని సూచించారు.

### కార్డులోనే కుల సర్వే, హెల్త్ ప్రొఫైల్..

ఈ ఒకే ఒక్క కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి , ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక, విద్యా శాఖల పథకాలతో పాటు ప్రభుత్వం అందించే అన్ని రకాల బీమా పథకాల వివరాలు ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైతే ఆధార్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక 'యూనిక్ ఐడెంటిటీ నంబర్' ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే' వివరాలను కూడా ఈ కార్డుకే అనుసంధానం చేయాలని చెప్పారు. లబ్ధిదారులతో పాటు వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను కూడా ఐటీ శాఖ సేకరించాలన్నారు.

### అక్రమాలకు అడ్డుకట్ట.. ఆటోమేటిక్ అప్‌డేట్!

ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ ద్వారా ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం ఆటోమేటిక్‌గా చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరిపోయేలా సాంకేతికత ఉండాలని సీఎం సూచించారు. తద్వారా చనిపోయిన వారి పేరు మీద పెన్షన్లు నొక్కేసే దందాకు బ్రేక్ పడనుంది. ప్రజల హెల్త్ ప్రొఫైల్‌ను కూడా దీనికే లింక్ చేయనున్నారు.

### గల్ఫ్ వలసలపై 'కేరళ' మోడల్ అధ్యయనం..

తెలంగాణ నుండి ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే కార్మికుల రక్షణ కోసం కేరళ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం అంతా ఒకే చోట ఉంచితే, నకిలీ ఏజెంట్ల ప్రమేయం తగ్గి పేద కార్మికులు మోసపోకుండా ఉంటారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పేదలకు సంక్షేమ ఫలాలు నూటికి నూరు శాతం చేరేలా ఈ వ్యవస్థను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు

### ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కొమురం భీమ్ ఆసిఫాబాద్ (మనసులో మాట): బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు (ఎమ్మెల్యే) కోవ లక్ష్మి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ముస్లిం సోదర సోదరీమణులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్‌కు ఆమె స్వయంగా మిఠాయిలు తినిపించి అభినందనలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ త్యాగానికి, సౌభ్రాతృత్వానికి నిలువెత్తు ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదర సోదరీమణులందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, ఆసిఫాబాద్ పార్టీ అధ్యక్షుడు జబోరే రవీందర్, సాయి ప్రవణ్, రెబ్బెన మాజీ జెడ్పీటీసీ బాపురావు తదితరులు పాల్గొన్నారు



# ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా

- ఎఫ్‌సిఐ ద్వారా ఎందుకు కొనరో చెప్పాలి
- బిజెపి నేతలపై మండిపడ్డ మంత్రి అడ్లూరి



**జగిత్యాల,(మనసులో మాట) :** ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గురువారం జగిత్యాల జిల్లాలో మంత్రి అడ్లూరి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాలు పేరుతో దోచుకుంటున్నామని బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భద్రాద్రి రాముడి ఆలయం ముందు మాట్లాడాలని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డితో కలసి పనిచేద్దామని అన్నారని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురావడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి బీజేపీ ఎంపీలు నిధులను తీసుకురావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ చేశారు. ఇదిలావుంటే ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బక్రీద్ సందర్భంగా ధర్మపురిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అదేవిధంగా ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగ యువతీయువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్ పూర్తయిన యువతీయువకులకు స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల రుణాలు బ్యాంకు ద్వారా ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసక్తి కలిగిన యువత రుణాల ద్వారా స్వయం ఉపాధి పొందాలని మంత్రి కోరారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ ఛైర్మన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సంగనభట్ల దినేష్ తదితరులు ఉన్నారు.

# దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబుల వెల్లడి



**హైదరాబాద్(మనసులో మాట) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ పనులపై మార్గనిర్దేశర చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆధునిక మౌలిక వసతులతో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికి తలమానికంగా నిలవడం ఖాయమని మంత్రులు స్పష్టం చేశారు.

# జడ్చర్ల వద్ద అర్ధరాత్రి రెండు బస్సుల ఢీ

**ప్రమాదంలో ఒకరు మృతి:**

**14మందికి గాయాలు**

**మహబూబ్‌నగర్, (మనసులో మాట):** మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సును.. బెంగళూరు వైపు వెళ్తున్న మరో ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో 14 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిని తిరుపతి రిటైర్డ్ డీఎస్పీ సాంబశివారెడ్డి కుమారుడు అశోక్ రెడ్డిగా గుర్తించారు. అశోక్‌రెడ్డి మృతి వార్తతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ప్రమాదానికి అధిక వేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం కారణంగా కాసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా, పోలీసులు వాహనాలను మళ్లించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇటీవల జాతీయ రహదారులపై వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో డ్రైవర్లు అలసట, అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ఇలాంటి ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రయాణ భద్రతపై మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

**ఏపీ రైతు సంఘం**

**పాములపాడ్(మనసులో మాట) :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించి, దాన్ని పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం పాములపాడు బస్టాండ్ సెంటర్‌లో రైతులతో కలిసి నిరసన తెలిపి, మద్దతు ధర కల్పించలేని జీఓ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న, జొన్న పంటలకు సరైన ధర లేకపోవడంతో దళారుల చేతిలో రైతులు నిలువునా దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల ధరలు పెరుగుతున్నా పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామాల్లో జొన్నలు కొనే నాథుడు లేక బస్తాలు మూలపడి ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరిచి ఆదుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు డి.స్వామన్న, ఎస్.ఆర్.రమణ, బాలయేసు, ఎస్.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి పోలీస్ కార్యాలయం ముందే దారుణం

**ఒంటరిగా వెళుతున్న యువతిపై ఐదుగురు నేపాలీల దాడి**

**కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఐదుగురికి దేహశుద్ధి**

**హైదరాబాద్,(మనసులో మాట) :** హైదరాబాద్ బషీర్ బాగ్‌లో ఒంటరిగా వెళ్తున్న ఓ యువతి పట్ల కొందరు దుండగులుఅసభ్యంగా ప్రవర్తించారు. బుధవారం రాత్రి బషీర్ బాగ్ సీసీఎస్ కార్యాలయం ఎదురుగా ఈ దారుణం చోటుచేసుకుంది. రోడ్డుపై ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న యువతిని చూసి... ఐదుగురు నేపాలీ యువకులు రెచ్చిపోయారు. నడిరోడ్డుపైనే ఆమె చేయి పట్టి లాగుతూ అసభ్యంగా ప్రవర్తించారు. ఈ ఊహించని పరిణామంతో తీవ్ర భయాందోళనకు గురైన ఆ యువతి.. ధైర్యం చేసి గట్టిగా కేకలు వేసింది.యువతి అరుపులు విన్న చుట్టుపక్కల ప్రజలు, స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. పారిపోవడానికి ప్రయత్నించిన ఆ ఐదుగురు నేపాలీలను చుట్టుముట్టి నిర్బంధించారు. నడిరోడ్డుపైనే వారికి స్థానికులు దేహశుద్ధి చేశారు. అనంతరం నిందితులను అబిడ్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో వీరంతా స్థానికంగా ఉండే ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నట్లు తేలింది. నిందితులను సునీల్, ఉమేష్, లక్ష్మణ్, పురుషోత్తం, రామ్ గా గుర్తించారు. ఈ ఐదుగురిపై కేసు నమోదు చేసిన అబిడ్స్ పోలీసులు... దర్యాప్తును వేగవంతం చేశారు. నడిరోడ్డుపై, అది కూడా పోలీస్ కార్యాలయం ముందే ఇలాంటి ఘటన జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న కోమటిరెడ్డి

**నల్గొండ(మనసులో మాట) :** బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి మాట్లాడారు. బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో' యాత్ర చేపట్టారని ప్రస్తావించారు. అన్నివర్గాలు, అన్నిమతాల ప్రజలు సమానమేనని, అందరు కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో 'భారత్ జోడో' యాత్ర చేశారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అనడానికి ఇది ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. నల్గొండలో మతసామరస్యానికి, గంగా - జమునా - తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

# జూన్ 2ను ఆర్టీసీ విలీనం డేగా ప్రకటించాలి

- ఎంపిలను కలిసి విన్నవించిన జెఎసి నేతలు
- ఆర్టీసీ విలీనంపై స్పష్టత కోరుతూ 1న ఇందిరాపార్క్ వద్ద దీక్ష
- తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రకటన



**హైదరాబాద్(మనసులో మాట) :** ఆర్టీసీ ఎన్నికల కంటే ముందుగానే జూన్ 2న విలీనం అపాయింటెడ్ డేట్ ను ప్రభుత్వం ప్రకటించాలని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ముఖ్యమంత్రి రాజకీయ ప్రధాన సలహాదారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి కి, ఎంపీ రఘురామ్‌రెడ్డిని జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ రవాణా శాఖ మంత్రి ఇటీవల ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు జరిగిన తరువాతనే విలీనం పక్రియను ప్రారంభిస్తామని వెల్లడించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, యాదగిరి, బాబు, బుద్ద విశాల్, రవికిరణ్ పాల్గొన్నారు. ఇదిలావుంటే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లుగా అపాయింటెడ్ డే ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సామూహిక దీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. యూనియన్ ఎన్నికలకు ముందుగా ఉద్యోగుల పక్రియ పూర్తి చేయాలని.. 2026 మే 1 నుంచి అపాయింటెడ్ డే ప్రకటించాలని టీజేఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. అపాయింటెడ్ డే కంటే ముందుగా యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రకటించడంతో ఉద్యోగుల్లో అయోమయం నెలకొందని వారు అభిప్రాయపడ్డారు. జూన్ 1వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇందిరాపార్క్ వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్రకార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. ప్రభుత్వంలో విలీనం కోరుకునే ఉద్యోగులంతా యూనియన్లకు అతీతంగా ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షకు తెలంగాణ ఆర్టీసీ కార్మిక సమాఖ్య కూడా మద్దతు ప్రకటించింది. యాజమాన్యం వద్ద పరిష్కారం కావాల్సిన 29 సమస్యలపై చర్చలు కొనసాగుతున్న సమయంలో ఎన్నికలకు వెళ్లడం వల్ల కార్మికులు నష్టపోతారని కార్మిక సమాఖ్య నాయకులు కె.రాజిరెడ్డి తెలిపారు. విలీనం అనంతరం యూనియన్లు కొనసాగితే ఎన్నికల అంశాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు. విలీనానికి సంబంధించిన విధివిధానాలు రూపొందించే కమిటీలో ప్రతి యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అపాయింటెడ్ డే ప్రకటించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

# ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

- కావాలనే యాగీచేస్తున్న పలువురు నేతలు
- ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయన్న ఉత్తమ్

**హైదరాబాద్(మనసులో మాట) :** తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో 75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ ప్రతిపక్షాలు రాజకీయ లబ్ది కోసం ధాన్యం కొనుగోళ్లపై రాద్దాంతం చేస్తున్నాయని విమర్శించారు. కొనుగోలు పక్రియను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇకపోతే అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని మరోమారు స్పష్టంచేశారు. రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కొని బాయిల్డ్ రైస్‌మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడిన పరిస్థితులపై మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించామని అన్నారు. అకాల వర్షాలకు తడిసిన 9,214టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నష్టం కలిగించే ఎటువంటి చర్యలనూ ప్రభుత్వం ఉపేక్షించబోదని అన్నారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు 66.75లక్షల టన్నుల ధాన్యంచేరగా, అందులో 57లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులకు ఇప్పటివరకు రూ.10,097కోట్ల చెల్లింపులు జరిగాయని, దీని ద్వారా 8.15లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. కొనుగోలు చేసిన 57లక్షల టన్నుల ధాన్యంలో 44.67 లక్షల టన్నులు దొడ్డు రకాల ధాన్యం కాగా, 12.33లక్షల టన్నులు సన్న రకాల ధాన్యం అని మంత్రి పేర్కొన్నారు. ధాన్యాన్ని మిల్లులకు వేగంగా తరలించేందుకు ఇసుక సరఫరా చేసే లారీలను కొనుగోలుకేంద్రాలకు మళ్లించినట్లు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి



- డబ్బా ఇళ్లు కాదు..డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది
- పొంగులేటి సవాల్‌పై కెటిఆర్ ప్రతిసవాల్

**హైదరాబాద్,(మనసులో మాట) :** సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం. డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. ఓట్లు అడుగుతాం అనే సవాల్‌కు కట్టుబడి ఉండాలి. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఘనత మాది. రూ.70 వేలతో మేం అగ్గిపెట్టె ఇళ్లు కట్టలేదు. మేం కట్టిన ఒక్కో ఇల్లు.. 7 ఇందిరమ్మ ఇళ్లతో సమానం. వీకెండ్‌లో ప్రజలు ఇళ్లు కూల్చి వికృతానందం పొందుతున్నారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని?పడగొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? మీరెన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం‘ అని కేటీఆర్ పేర్కొన్నారు.

## నల్లగొండ జిల్లా లో తడిసిన ధాన్యం కొనుగోలు

**జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్**



**నల్లగొండ,మే 28,(మనసులో మాట):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.గురువారం జిల్లాలోని కొన్ని కేంద్రాలలో అకాల వర్షానికి ధాన్యం తడిసిందని, అయితే అలాంటి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. తిప్పర్తి మండలం పజ్జూరులో 650 బస్తాలు, కనగల్ మండలం లచ్చు గూడెంలో 1800 బస్తాలు, తిప్పర్తి మండలం కేశ రాజు పల్లి లో 100 బస్తాలు వర్షానికి తడిచిపోగా వాటిని కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు పంపించామని, అలాగే తిప్పర్తి మండలం జొన్నల గూడెంలో 3000 బస్తాలు పాక్షికంగా తడిచాయని, అనుముల మండలం ముక్కపల్లిలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈరోజుతో మూసివేసేందుకు చర్యలు తీసుకోగా, 3 లారీలు కొనుగోలు కేంద్రానికి పంపించి ధాన్యాన్ని తూకం వేసి లారీలలో లోడ్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన అకాలవర్షానికి చెట్లు కూలిపోవడం, పట్టాలు ఎగిరిపోవడంతో 2200 బస్తాలు వర్షానికి తడిచాయని, వాటిని కూడా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు పంపిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

## కామారెడ్డిలో వ్యాపారి కిడ్నాప్ కుట్ర భగ్నం

**ఆరుగురి అరెస్ట్ తుపాకీ స్వాధీనం...**

**కామారెడ్డి(మనసులో మాట):** కామారెడ్డి జిల్లాలో వ్యాపారిని కిడ్నాప్ చేసి భారీగా డబ్బు వసూలు చేయాలనే పథకాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఈ ఘటనలో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర గురువారం వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, మహారాష్ట్ర నుంచి అక్రమంగా తుపాకీని సేకరించిన నిందితులు కిడ్నాప్‌కు ప్రణాళిక రచించారు. వ్యాపారిని లక్ష్యంగా చేసుకుని అపహరణకు ప్రయత్నిస్తుండగా, తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి సమీపంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఫైర్ ఆర్మ్, రబ్బర్ బుల్లెట్లు, మొబైల్ ఫోన్లు, మాస్కులు, బైక్ సహా కిడ్నాప్‌కు ఉపయోగించాల్సిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం ఆధారంగా పోలీసులు సమయోచితంగా చర్యలు తీసుకోవడంతో పెద్ద ఘటన తప్పిందని అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులపై మరింత విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.



# పామాయిలే ప్రత్యామ్నాయ పంట

- పామాయిల్ రైతులే... పర్యావరణ పరిరక్షకులు
- తెలంగాణ ఉద్యానశాఖ మాజీ కమిషనర్ కె వెంకట్రామ్ రెడ్డి

**రంగారెడ్డి,(మనసులో మాట జిల్లా):** ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ రైతాంగానికి ఒకే ఒక ప్రత్యమ్నాయం అయిల్ పామ్ సాగు చేయడమేనని రిటైర్డ్ కమీషనర్ వెంకటరామ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎల్బీనగర్ నియోజకవర్గం, కొత్తపేటలోని వైష్ణవి కన్వెన్షన్ లో ఉమ్మడి నల్లగొండ అయిల్ పామ్ రైతుల సమావేశానికి నల్లగొండ జిల్లా ఆయిల్ ఫామ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రేగట్టి గురువారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ ఉద్యానశాఖ మాజీ కమిషనర్ వెంకట్రామ్ రెడ్డి, ఖమ్మం జిల్లా ఆయిల్ ఫామ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటున్న వరి పంట సంక్షోభం నుంచి బయట పడాలంటే అయిల్ పామ్ సాగును చేపట్టడం తప్ప మరో మార్గం లేదన్నారు. నీరు పుష్కలంగా ఉన్నప్పుడు వరి సాగు చేస్తున్న వారు తక్షణమే పంట మార్పిడికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగానా లో కి అయిల్ పామ్ పంటను తీసుకురావడానికి తన ప్రయత్నాలకు ఎదురైన అడ్డంకులను వివరించారు. అయిల్ పామ్ అఫ్రికా, మలేషియా, ఇండోనేషియా, థాయిలాండ్ తదితర దేశాలలో పరిస్థితులను వివరించారు. పామాయిల్ రైతులు సంఘటితం కావాలని, మున్ముందు సహకార సొసైటి లుగా ఏర్పాటు కావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కంటే కూడా తెలంగాణ భూములు పామాయిల్ అత్యంత అనుకూలమని వెంకట్రామరెడ్డి అభిప్రాయపడ్డారు. నల్లగొండ జిల్లాలో పామాయిల్ రైతుల సమస్యలను పరిష్కరించడంలో జిల్లా సొసైటి కృషిని కొనియాడారు. రైతుల సొసైటిల ద్వారా థాయిలాండ్ లో జరుగుతున్న కృషిని తెలుసుకునేందుకు నల్లగొండ జిల్లా నుంచి ఒక బృందం వెళ్ళాలని అక్కడి వారితో సంప్రదింపులకు తాను సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. పలువురు రైతుల సమస్యలను తెలుసుకొని వారికి తగిన సలహాలను, సూచనలను తెలియజేశారు.

ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అశ్వరావుపేట, సత్తుపల్లి ఏరియాలలో గత 25 సంవత్సరాల నుండి వారి అనుభవాలను వివరించారు. 1993 ఆయిల్ ఫామ్ యాక్ట్ ను రైతులందరూ తెలుసుకోవాలని తెలిపారు. రైతులు సంఘటితంగా ఉండి మన సమస్యల



పరిష్కారానికి మనమందరము కలిసి కృషి చేయాలని అన్నారు. రైతులకు పామ్ ఆయిల్ పంట గురించి అపోహలు ను తొలగించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని చెప్పారు. పామాయిల్ తోటల పెంపకం వలన పర్యావరణ పరిరక్షణను కాపాడే వారం అవుతామని అన్నారు. ఈ తోటలు 30 సంవత్సరాల వరకు ఉంటాయని, ఇవి కార్బన్ డైయాక్సైడ్ ను ఎక్కువగా పీల్చుకొని, ఆక్సిజన్ ను విడుదల చేస్తాయని, అందువలన పామాయిల్ రైతులే పర్యావరణ పరిరక్షకులు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా పామ్ ఆయిల్ రైతులు నరేందర్ రెడ్డి, మేకల ప్రదీప్ రెడ్డి, గడ్డం సత్యనారాయణ, విజయ్ కుమార్, శ్యామల నరసింహారెడ్డి, సంగీత్ రెడ్డి, యాదగిరి రెడ్డి, నరసింహారెడ్డి, మల్లారెడ్డి, దొడ్డ సాంబా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో మిన్నంటిన బక్రీద్ సంబరాలు

## ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు







- నగరం గంగా-జమునా తెహజీబ్‌కు ప్రతీక
- సీపీ పి. సాయి చైతన్య కొనియాడల్

**నిజామాబాద్ (మనసులో మాట) :** త్యాగం, భక్తి, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పర్వదినాన్ని నిజామాబాద్ నగరంలో ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే నగరంలోని ప్రధాన ఈద్గాలు, మసీదులు ప్రార్థనలతో మార్మోగిపోయాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ సరికొత్త వస్త్రాలు ధరించి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక నమాజ్‌లలో పాల్గొన్నారు.

### ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక దుఆ

గాంధీచౌక్ సమీపంలోని మస్జిద్ ఏ కచియా, బోధన్ రోడ్డులోని అతి ప్రాచీనమైన మదీనా ఈద్గా (పెయింటరకాలే), మస్జిద్ ఏ రహ్మానియా, రజా బేగ్ మస్జిద్, జమామస్జిద్ తదితర ప్రాంతాల్లో భారీ సంఖ్యలో భక్తులు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచ శాంతి, దేశాభివృద్ధి, ప్రజల సుఖసంతోషాల కోసం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక దుఆ చేశారు. నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కట్టుదిట్టమైన భద్రత..



స్వయంగా పరిశీలించిన సీపీ పండుగ సందర్భంగా నగరంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. బందోబస్తు: ముఖ్య కూడళ్లు, ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేశారు. కమిషనర్ పర్యటన: పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య స్వయంగా వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విధుల్లో ఉన్న అధికారులకు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిజామాబాద్ నగరం గంగా-జమునా తెహజీబ్, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని, అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో పండుగలను జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి శాంతిభద్రతల రక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

ఖుర్బానీ అంటే సేవాభావం: మత పెద్దలు జిల్లా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగస్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు. ఖుర్బానీ అనేది కేవలం ఆచారం మాత్రమే కాకుండా మానవతా విలువలు, సేవాభావం, సహనం, సోదరభావాన్ని పెంపొందించే గొప్ప సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందాలని వారు ఆకాంక్షించారు.

# బక్రీద్ శాంతియుత వాతావరణంలో జరిగింది

### పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

**నిజామాబాద్, మే 28 (మనసులోమాట):** బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవడం ఎంతో సంతోషమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు సిబ్బంది ఏర్పాటు చేసిన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను సీపీ స్వయంగా పరిశీలంచి పలు సూచనలు చేశారు. గురువారం టౌన్-5 పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, భక్తుల రాకపోకలు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు సామరస్య వాతావరణంలో పండుగను జరుపుకోవాలని, అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి శ్రీ ప్రకాష్, హోంగార్డ్ ఏసిపి దీపక్ చంద్ర, సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీకాంత్ రెడ్డి



**నిజామాబాద్ (మనసులో మాట):** జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీకాంత్ రెడ్డి గురువారం డొంకేశ్వర్ సొసైటీ పరిధిలోని నడ్కూడ, గాదెపల్లి, ఉమ్మెడ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడంతో పాటు నిల్వ ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కేంద్రాల ఇన్‌చార్జీలకు సూచించారు. ట్యాబ్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేసి, ఈ నెల 30 నాటికి ధాన్యం సేకరణ పూర్తిచేసి కొనుగోలు కేంద్రాలను మూసివేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బ్యాక్‌వాటర్‌లో మునిగిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయరాదని స్పష్టం చేశారు. అనంతరం నందిపేట్ మండలం జోర్పూర్‌లోని పూర్ణిమా పారా బాయిల్డ్ రైస్ మిల్లును సందర్శించి, లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, మిల్లర్ అంగీకార ప్రక్రియను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని మిల్ యాజమాన్యానికి సూచించారు.

# ఈడీ దాడులు రాజకీయ కక్షసాధింపే

### సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు




**నిజామాబాద్ (మనసులో మాట):** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరై విజయన్‌పై ఈడీ దాడులు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని ఆరోపిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా వద్ద గురువారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగిస్తోందని విమర్శించారు. పినరై విజయన్ నిజాయితీ గల నాయకుడని, ఆయన కుటుంబంపై జరిగిన దాడుల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే విధానాలు అమలు చేయాలని, లేకపోతే సీపీఎం రాజకీయంగా పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్ది వెంకట్‌రాములు, సుజాత, నల్వాల నరసయ్య, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు త్వరగా పూర్తి చేయండి

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**



**గన్నేరువరం (మనసులో మాట):** గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, కేంద్రంలో ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో ఉన్న మొక్కజొన్న మొత్తాన్ని రాబోయే రెండు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వచ్చే నెల 1వ తేదీ తర్వాత కొనుగోలు కేంద్రాలు మూసివేయబడుతున్న నేపథ్యంలో, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంకా ఎవరి వద్దనైనా మొక్కజొన్న నిల్వలు ఉంటే వెంటనే కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించుకోవాలన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో సిద్ధంగా ఉన్న దాదాపు 20 లారీల మొక్కజొన్నను త్వరగా కొనుగోలు చేసి, రైతులకు వెంటనే డబ్బులు చెల్లించేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అట్టడుగున ఉన్నవారి అభివృద్ధే బీజేపీ లక్ష్యం

**ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

**నిజామాబాద్ (మనసులో మాట):** సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తి కూడా అభివృద్ధి చెందాలన్నదే పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయమని, అదే దిశగా బీజేపీ పనిచేస్తోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని బోర్గాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" నినాదాలతో బీజేపీ ముందుకు సాగుతోందన్నారు. కార్యకర్తలు జ్యుఖితీఎ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, పల్లె గంగారెడ్డి, స్రవంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కామారెడ్డి ఈద్గాలో బక్రీద్ ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్న షబ్బీర్ అలీ





- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ సలహాదారు
- సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే 'కుల గణన' కీలకం

**కామారెడ్డి (మనసులో మాట):** పవిత్ర బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పర్వదినాన్ని పురస్కరించుకొని కామారెడ్డి పట్టణంలోని కోర్టు ఆవరణలో గల ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించి, అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈద్-ఉల్-అజ్హా పండుగ త్యాగం, విశ్వాసం, కరుణ, మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో శాంతి, సంతోషం, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షిస్తూ, సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.

### కుల గణనలో భాగస్వాములు కావాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన (సెన్సస్) ప్రక్రియపై షబ్బీర్ అలీ ప్రత్యేకంగా మాట్లాడారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన న్యాయం జరగాలంటే కుల గణన ఎంతో కీలకమని స్పష్టం చేశారు. ఈ సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రజల్లో దీనిపై అవగాహన పెంచాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు అధికారులపై ఉందన్నారు.

### బీజేపీ ప్రభుత్వ విధానాలపై ధ్వజం

ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై షబ్బీర్ అలీ విమర్శలు గుప్పించారు. కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ (SIR) పేరుతో ప్రతిపక్షాల ఓట్లను ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి రాజ్యాంగ విరుద్ధ చర్యలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును జాగ్రత్తగా పరిరక్షించుకోవాలని సూచించారు. భారతదేశం గంగా-జమునా తహజీబ్, భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని పేర్కొంటూ, మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఇదే సమయంలో ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలనే ప్రతిపాదనకు ఆయన తన మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, అధికారులు, మత పెద్దలు మరియు భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# త్యాగానికి విశ్వాసానికి ప్రతీక బక్రీద్ పండుగ

- నల్లగొండ ఈద్గాలో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- గతంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి



**నల్లగొండ (మనసులో మాట) :** ప్రవక్త ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగం, విశ్వాసం, మానవతా విలువలను స్మరించుకుంటూ జరుపుకునే బక్రీద్ పండుగ సమాజానికి ఐక్యత, సహనం, పరస్పర ప్రేమాభిమానాల సందేశాన్ని అందిస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పవిత్ర బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లగొండ పట్టణంలోని మునుగోడు రోడ్‌లో గల ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ముస్లిం సోదరులను కలిసి ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసి జీవించడం ఈ గడ్డ ప్రత్యేకత అని, ఆ స్ఫూర్తి భవిష్యత్తులో మరింత బలపడాలని మంత్రి ఆకాంక్షించారు. 4 శాతం రిజర్వేషన్లు: గతంలో తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి, విద్యా, ఉపాధి రంగాలలో గొప్ప అవకాశాలు అందించామని గుర్తుచేశారు. మౌలిక వసతులు: ముస్లింల కోసం పట్టణ ప్రాంతాల్లో షాదీఖానాల నిర్మాణం చేపట్టడంతో పాటు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలలో కూడా తగిన అవకాశాలు కల్పించామని వివరించారు. నల్లగొండ పట్టణంలో గత 30 సంవత్సరాలుగా ఎలాంటి మత ఘర్షణలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి సోదరభావంతో జీవిస్తున్నారని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముస్లింల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అందరికీ సంక్షేమాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు.

### హాజరైన ఉన్నతాధికారులు, ప్రముఖులు

ఈ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. త్యాగం, సేవా మార్గాన్ని గుర్తు చేసే గొప్ప పండుగ బక్రీద్ అని పేర్కొంటూ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సైతం జిల్లా ప్రజలందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నివాళి మరియు శుభాకాంక్షల కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఏఎస్పీ రమేష్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, గ్రంథాలయ చైర్మన్ హాఫీజ్ ఖాన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, స్థానిక కార్పొరేటర్ మామిడి కార్తీక్ తదితరులతో పాటు భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లాలో ఘనంగా బక్రీద్

**శుభాకాంక్షలు తెలిపిన మంత్రి వాకిటి శ్రీహరి!**

**మక్తల్ ఈద్గా వద్ద ముస్లిం సోదరులను కలిసిన మంత్రి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి**

**గ్రామగ్రామాన ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు.. మిన్నంటిన పండుగ శోభ**

### శాంతి, సామరస్యాలకు ప్రతీక బక్రీద్ పర్వదినం

**మక్తల్,(మనసులో మాట):** త్యాగానికి, భక్తికి మరియు మానవతా విలువలకి నిలువెత్తు ప్రతీకగా నిలిచే పవిత్ర బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పర్వదిన వేడుకలను నారాయణపేట జిల్లావ్యాప్తంగా ముస్లిం మైనార్టీ సోదరులు గురువారం నాడు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండల కేంద్రాలతో పాటు గ్రామ గ్రామాన గల ప్రధాన ఈద్గాలు, మసీదులలో ముస్లిం సోదరులు భారీగా చేరుకుని ప్రత్యేక నమాజ్ (ప్రార్థనలు) నిర్వహించారు.

### ముస్లిం సోదరులకు మంత్రి, ఎమ్మెల్యేల ఆలింగనం

మక్తల్ పట్టణంలోని ప్రధాన ఈద్గా వద్ద నిర్వహించిన బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ గౌడ్ ముస్లిం సోదరులను ప్రత్యేక్షంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' చెప్పారు. ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, శాంతి, ఐక్యతను నింపాలని వారు ఆకాంక్షించారు.

### పెద్దల స్మరణ.. ఒకరినొకరు అభినందించుకుంటూ..

ప్రత్యేక నమాజ్ ముగిసిన తర్వాత ముస్లిం సోదరులు ఒకరినొకరు పలకరించుకుంటూ పండుగ శుభాకాంక్షలు మార్పిడి చేసుకున్నారు. అనంతరం ముస్లిం సాంప్రదాయం ప్రకారం కబరస్తాన్ (స్మశాన వాటికలు) వద్దకు వెళ్లి, మరణించిన తమ కుటుంబ పెద్దల సమాధులను (గోర్లను) దర్శించుకున్నారు. సమాధులపై పూలమాలలు వేసి, ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ వారిని భక్తితో స్మరించుకున్నారు.

### జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణం

నారాయణపేట జిల్లా పరిధిలోని మక్తల్, మరికల్, ధన్వాడ, ఉట్కూర్ మండలాలతో పాటు జిల్లాలోని వివిధ గ్రామాలలో బక్రీద్ పండుగ వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయి. పండుగను పురస్కరించుకొని మరికల్ సీఐ భగవంతు రెడ్డి, మరికల్ ఎస్సై ఎం. విక్రమ్ ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, మత సామరస్యం ఉట్టిపడేలా ముస్లిం సోదరులు పండుగను ప్రశాంతంగా జరుపుకోవడం పట్ల హర్షం వ్యక్తమైంది. పోలీసులు ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు పర్యవేక్షించారు.



# బీజేపీ జిల్లా స్థాయి శిక్షణా తరగతులు ప్రారంభం

- ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎంపీ ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షుడు దినేష్
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కార్యకర్తలకు ఎంపీ పిలుపు



**నిజామాబాద్(మనసులో మాట):** నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా స్థాయి రెండు రోజుల పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శిక్షణా తరగతులు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా తరగతులను ప్రారంభించారు. అంతకుముందు వారు పార్టీ ఆధ్వర్యంలో అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకించారు.

### కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. భారీ హాజరు: జిల్లా వ్యాప్తంగా దాదాపు 96 శాతం మంది కార్యకర్తల హాజరుతో ఈ శిక్షణా తరగతులు ఇంత విజయవంతంగా ప్రారంభమవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సేవా భావంతో పనిచేయాలి: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలు, ఏకాత్మ మానవతావాద సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సమాజంలో సేవా భావంతో పనిచేయాలని, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా తరగతుల్లో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, పోలింగ్ బూత్ స్థాయి బలోపేతంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన పలువురు పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కై స్కూల్‌లో 'రోబోటిక్స్' శిక్షణ విజయవంతం

- వేములవాడలో మొట్టమొదటిసారిగా విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన
- హైదరాబాద్‌కు చెందిన 'జీబోటిక్స్ టెక్నాలజీస్' ఆధ్వర్యంలో ఉచిత వర్క్‌షాప్





**వేములవాడ(మనసులో మాట):** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేస్తూ, వివిధ నూతన ఆవిష్కరణలకు అవసరమైన మెలకువలు అందించేందుకు వేములవాడలో మొట్టమొదటిసారిగా స్కై స్కూల్‌లో రోబోటిక్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ మహేష్ తెలిపారు. గురువారం పాఠశాల ఆడిటోరియంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ 'జీబోటిక్స్ టెక్నాలజీస్' సంస్థతో కలిసి విద్యార్థులకు రోబోటిక్స్ పై నిర్వహించిన ఉచిత శిక్షణా కార్యక్రమం విజయవంతమైంది.

### మారుతున్న టెక్నాలజీపై అవగాహన

ఈ సందర్భంగా కరస్పాండెంట్ మహేష్ మాట్లాడుతూ.. రెగ్యులర్ చదువులతో పాటు విద్యార్థులకు ఆధునిక సాంకేతికతను పరిచయం చేసేందుకు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రత్యేకంగా రోబోటిక్ శిక్షణ తరగతులను కొనసాగిస్తామని ప్రకటించారు.

భారీగా హాజరు: వేములవాడ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలు, సిరిసిల్ల నియోజకవర్గం నుండి విద్యార్థులు ఈ ఉచిత శిక్షణకు భారీగా హాజరయ్యారు. ప్రాక్టికల్ శిక్షణ: జీబోటిక్స్ టెక్నాలజీ ప్రతినిధులు తోటం అక్షయ్, మ్యకల వినయ్, శీలం మానసలు విద్యార్థులకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. వర్క్‌షాప్‌లో భాగంగా రోబోటిక్స్ ప్రాథమిక అంశాలు, రోబోట్ కారు తయారీ విధానం, సాధారణ వైఫై కంట్రోల్ కారు తయారీ వంటి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ప్రాజెక్టులపై పిల్లలకు ప్రాక్టికల్ గా చేసి చూపించారు.

### భవిష్యత్తుకు బలమైన పునాది

విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని సరికొత్త విషయాలను నేర్చుకున్నారని నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల మేధోశక్తిని పెంచేందుకు ఉపయోగపడే మరిన్ని రోబోటిక్స్, స్టెమ్ (ఆజువీ) ఎడ్యుకేషన్ కార్యక్రమాలను నిర్వహించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సాధారణ పాఠశాల విద్యతో పాటు పిల్లలకు ఇలాంటి గ్లోబల్ టెక్నాలజీ అంశాలను నేర్పించడం వారి ఉజ్వల భవిష్యత్తుకు, ఉన్నత విద్యా ఆవిష్కరణలకు బలమైన పునాదిగా మారుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, జీబోటిక్స్ సంస్థ ప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎఖీన్‌పూర్ పీఏసీఎస్‌లో వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- రెండు కేంద్రాల్లో నూటికి నూరు శాతం కొనుగోలు.. రైతులకు అండగా నిలిచిన సింగిరెడ్డి నర్సారెడ్డి
- నాగులపేట, రామరావుపల్ల కేంద్రాల పరిధిలో 16,300 క్వింటాళ్ల ధాన్యం సేకరణ

**కోరుట్ల (మనసులో మాట):** ఎఖీన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అధికారులతో సమన్వయం చేస్తూ ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడటంలో సంఘం అధ్యక్షులు సింగిరెడ్డి నర్సారెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆయన కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించి పరిస్థితులను సమీక్షించినట్లు స్థానిక అన్నదాతలు తెలిపారు. రెండు కేంద్రాల్లో భారీ స్థాయిలో కొనుగోళ్లు ఎఖీన్‌పూర్ పీఏసీఎస్ పరిధిలోని నాగులపేట, రామరావుపల్ల కేంద్రాలలో కొనుగోళ్లు వేగంగా సాగాయి. నాగులపేట కేంద్రం: ఇక్కడ సుమారు 11 వేల క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు పూర్తి కాగా, రామరావుపల్ల కేంద్రం: ఇక్కడ సుమారు 5,300 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు పూర్తయింది. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వేగంగా తూకం వేసి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయడంలో పాలకవర్గం నిరంతరం పర్యవేక్షణ నిర్వహించింది. ధాన్యం నిల్వ, రవాణా, గిన్నీ సంచులు, తూకం వంటి అంశాల్లో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. సమస్యలను అధిగమించి సమన్వయం ధాన్యం కొనుగోలు సమయంలో అకాల వర్షాలు, లారీల రవాణా సమస్యలు వంటి అనేక ఇబ్బందులు ఎదురైనా రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు రైతులు తెలిపారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ సదుపాయాలు కల్పించడం, మిల్లులకు వేగంగా తరలించేలా చర్యలు చేపట్టడంలో సంఘం ప్రత్యేక చొరవ చూపింది. దీనివల్ల రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితులు లేకుండా వేగంగా కొనుగోళ్లు ముగియడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

### రైతు సంక్షేమమే మా లక్ష్యం: సింగిరెడ్డి నర్సారెడ్డి

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు సింగిరెడ్డి నర్సారెడ్డి మాట్లాడుతూ.. రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కేలా ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయడమే తమ సొసైటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అన్నదాతలు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియ నూటికి నూరు శాతం విజయవంతం కావడానికి సహకరించిన సంఘం వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, సొసైటీ కార్యదర్శి ఎండీ తాజోద్దీన్ బాబా, అధికారులు, సిబ్బంది, ఐకేపీ ప్రతినిధులు, హమాలీలు మరియు రైతులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భష్యత్తులో కూడా రైతుల సంక్షేమం కోసం తమ పీఏసీఎస్ ఇదే విధంగా కృషి కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



## వృద్ధులం ఆదుకోండి సారు

### డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్ ఎక్కడ?



**నల్లగొండ,మే 28,(మనసులో మాట):** నల్లగొండ పట్టణంలో కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ గాలివానకు శాంతి మహిళ మండలి ఎదుట ఉన్న భారీ వృక్షం కూలిపోవడంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. వృక్షం కూలిపోవడంతో సమీపంలోని వృద్ధాశ్రమం పూర్తిగా చీకట్లో మునిగిపోయింది. అక్కడ నివసిస్తున్న వృద్ధులు భయంతో వణికిపోతుండగా, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు పిచ్చమ్మ కన్నీటి పర్యంతమవుతూ "ఆపదలో ఉన్నారా దయచేసి ఆదుకోండి" అంటూ సహాయం కోసం వేడుకుంటున్నారు. "ఇక్కడ ఉన్నవారంతా వృద్ధులే మాకు తోడుగా నిలిచే వారు లేరా డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్ వెంటనే స్పందించాలి ఆపద మిత్రలు సహాయం చేయాలి" అంటూ వృద్ధాశ్రమంలోని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షం, ఈదురుగాలులతో నల్లగొండ మహానగరం అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగి, విద్యుత్ సరఫరా అంతరాయం కలిగినట్లు సమాచారం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## నారాయణపేట జిల్లాలో మిన్నంటిన బక్రీద్ సంబరాలు

### గ్రామగ్రామాన ఈద్గాల్లో ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు

### ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన మరికల్ సీఐ భగవంతు రెడ్డి, ఎస్సై విక్రమ్

**మనసులో మాట, మరికల్:** త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలిచే పవిత్ర బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పర్వదిన వేడుకలను నారాయణపేట జిల్లావ్యాప్తంగా ముస్లిం మైనార్టీ సోదరులు గురువారం నాడు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలోని గ్రామ గ్రామాన తెల్లవారుజాము నుంచే ముస్లిం సోదరులు సరికొత్త వస్త్రాలు ధరించి, సుగంధ ద్రవ్యాలు చల్లుకుని భక్తిభావంతో స్థానిక ఈద్గాలకు తరలివచ్చారు. ప్రధాన ఈద్గాలు, మసీదులలో మత పెద్దల ఆధ్వర్యంలో బక్రీద్ పండుగ ప్రత్యేక నమాజ్ (ప్రార్థనలు) నిర్వహించారు. ప్రపంచ శాంతి, ప్రజల సుఖసంతోషాల కోసం ఈ సందర్భంగా ప్రత్యేక దుఆ చేశారు.

### ఘనంగా శుభాకాంక్షల మార్పిడి.. పెద్దల స్మరణ

ప్రత్యేక ప్రార్థనలు ముగిసిన అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం ముస్లిం సంప్రదాయం ప్రకారం కబరస్తాన్ (స్మశాన వాటికలు) వద్దకు వెళ్లి, మరణించిన తమ కుటుంబ పెద్దల సమాధులను (గోర్లను) దర్శించుకున్నారు. సమాధులపై పూలమాలలు వేసి, అత్తరు చల్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ వారిని స్మరించుకున్నారు.

### మండలాల్లో పండుగ శోభ.. శుభాకాంక్షలు తెలిపిన పోలీసులు

నారాయణపేట జిల్లా పరిధిలోని మరికల్, ధన్వాడ, ఉట్కూర్, మక్తల్ మండల కేంద్రాలతో పాటు ఆయా మండలాల పరిధిలోని అన్ని గ్రామాలలో బక్రీద్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. పండుగను పురస్కరించుకొని మరికల్ సీఐ భగవంతు రెడ్డి, మరికల్ ఎస్సై ఎం. విక్రమ్‌లు ముస్లిం సోదరులను కలిసి హృదయపూర్వక బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో పండుగలు శాంతియుత వాతావరణంలో, మత సామరస్యంతో జరుపుకోవడం ఆనందదాయకమని వారు పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తగిన ముందస్తు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

### లారీల అన్‌లోడింగ్‌ను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

### అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

**నిజామాబాద్ (మనసులో మాట):** నిజామాబాద్ రూరల్ పరిధిలోని సాయి రాజలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ బాయిల్డ్ రైస్ మిల్లును జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుకు వచ్చిన ధాన్యం లోడ్లు, అన్‌లోడింగ్ విధానం, మిల్లింగ్ ప్రక్రియ మరియు బియ్యం నిల్వలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిల్లు వద్ద ధాన్యం లోడ్లతో లారీలు ఎక్కువ సమయం నిలిచి ఉండడాన్ని గమనించిన కలెక్టర్.. మిల్లు యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకుని లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుత అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు వెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. మిల్లు సామర్థ్యానికి అనుగుణంగా పూర్తి స్థాయిలో మిల్లింగ్ నిర్వహించి, ధాన్యం మరియు సేకరించిన బియ్యాన్ని సురక్షితంగా భద్రపరచాలని స్పష్టం చేశారు. అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, రోజువారీ నివేదికలను తనకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి (DSO) శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, ఏఎస్ఓ అరవింద్ రెడ్డిలతో పాటు స్థానిక రెవెన్యూ మరియు పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## కమ్యూనిటీ హాల్‌ను 'మీసేవ'కు ఇవ్వబోం

### కాలనీవాసులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హామీ!

### నిరసనగా కాలనీవాసులతో కలిసి వార్డ్ ఆఫీస్, మీసేవ కేంద్రానికి తాళం వేసిన సుధీర్ రెడ్డి

**ఎల్బీనగర్, మే 28 (మనసులో మాట):** చైతన్యపురి డివిజన్‌లోని వికాస్ నగర్ కాలనీ లోని మీ సేవ భవనాన్ని పోలీస్ స్టేషన్ కోసం, న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను మీసేవా కార్యాలయం కోసం ఉపయోగించేందుకు జీ.హెచ్.ఎం.సీ, పోలీస్ అధికారులు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కి మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన సుధీర్ రెడ్డి కాలనీకి చేరుకుని డీసీ శ్రీనివాస్ ని పిలిపించి, దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ మీసేవ కార్యాలయానికి ఇవ్వబోమని స్పష్టం చేశారు. కాలనీవాసులకు అండగా తాను నిలబడతానని హామీ ఇచ్చి, జోనల్ కమిషనర్‌తో మాట్లాడారు. మీ సేవ, వార్డ్ ఆఫీస్ వద్దకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కాలనీ వాసులతో కలిసి వెళ్లి తాళం వేశారు. మీ సేవ కమిషనర్ రవి కిరణ్‌తో మాట్లాడి కాలనీవాసులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ విట్టల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీవాసులు సుష్మిత, రోజా, పద్మిని, భవాని నగర్ కాలనీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వికాస్ నగర్ కాలనీ అధ్యక్షులు వెంకటేష్, శోభారాణి, పవన్, సంతోష్, తులసి, కృష్ణ, గట్టు శ్రీను, రమణారెడ్డి, జలంధర్, కిరణ్, నరేష్, శ్రీధర్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ చూపిన మార్గం భావితరాలకు మార్గదర్శకం

## ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం పనామా చౌరస్తాలో అన్నగారి విగ్రహానికి ఎమ్మెల్యే ఘన నివాళి**



**ఎల్బీనగర్, (మనసులో మాట):** విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ నందమూరి తారకరామారావు 103వ జయంతి సందర్భంగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వనస్థలిపురం పనామా కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, ప్రముఖ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి నందమూరి తారకరామారావు అని ఆయన కొనియాడారు. ఎన్టీఆర్ కేవలం సినీ రంగంలోనే కాకుండా, రాజకీయాల్లోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే ప్రభంజనం సృష్టించి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారని అన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆయన తీసుకున్న రెండు రూపాయల కిలో బియ్యం, జనతా వస్త్రాలు వంటి చారిత్రాత్మక నిర్ణయాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయన్నారు. ఆయన చూపిన మార్గం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పలు డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

# బైక్ చోరీ కేసులో నిందితుడు అరెస్టు

## 6 వాహనాలు స్వాధీనం..

**నిజామాబాద్ (మనసులో మాట):** నిజామాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 6 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్ఓ రఘుపతి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, కామారెడ్డి జిల్లా పెద్దకొడపగల్ మండలం శివపురం గ్రామానికి చెందిన వధేరా నవీన్ నిజామాబాద్ నాందేవ్ వాడలో నివసిస్తూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. నకిలీ తాళాలతో వివిధ ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు, మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.



# చెన్నూరు పీఏసీఎస్‌లో జీలుగు విత్తనాల పంపిణీ షురూ

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ప్రారంభం.. 250 క్వింటాళ్లు అందుబాటులో..
- పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే పంపిణీ.. రైతులకు 50 శాతం ప్రభుత్వ సబ్సిడీ



**చెన్నూర్ టౌన్,(మనసులో మాట):** చెన్నూరు మండలంలోని రైతాంగానికి పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే జీలుగు విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ద్వారా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రస్తుతానికి మొత్తం 250 క్వింటాళ్ల (833 బ్యాగులు) విత్తనాలను చెన్నూరు సొసైటీలో అందుబాటులో ఉంచారు. చెన్నూరు శాసనసభ్యులు, రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైంది. కాగా, ఈ విత్తనాల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు వీలుగా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించబడుతుందని అధికారులు స్పష్టం చేశారు.

## ఒక హెక్టారుకు ఒక బ్యాగ్ సరిపోతుంది

వ్యవసాయ అధికారుల సమాచారం ప్రకారం.. 30 కేజీల బరువు ఉండే ఒక బ్యాగ్ జీలుగు విత్తనాలు రెండున్నర ఎకరాల (ఒక హెక్టార్) పొలానికి పక్కాగా సరిపోతాయి. ఈ విత్తనాలపై ప్రభుత్వం రైతులకు భారీగా సబ్సిడీని అందిస్తోంది. ధర మరియు సబ్సిడీ వివరాలు: మార్కెట్లో ఒక బ్యాగ్ పూర్తి ధర రూ. 4,905.00 కాగా, దీనిపై ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ (రూ. 2,452.50) ఇస్తోంది. దీనివల్ల లబ్ధిదారులైన రైతులు కేవలం రూ. 2,452.50 నికర ధర చెల్లించి సొసైటీలో బ్యాగును పొందవచ్చు.

## కావలసిన పత్రాలు ఇవే..

జీలుగు విత్తనాలు కావలసిన మండల పరిధిలోని రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఊజుఊ) లేదా మండల వ్యవసాయ అధికారి (ఊఊ) ని సంప్రదించాలని చెన్నూరు వ్యవసాయ శాఖ అధికారులు కోరారు. విత్తనాల కోసం వచ్చేటప్పుడు రైతులు తమ వెంట కింది పత్రాల జిరాక్స్ ప్రతులను తీసుకురావాల్సి ఉంటుంది:

గుర్తింపు కార్డు (ఆధార్ కార్డ్) జిరాక్స్ పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో చెన్నూరు మండల పరిధిలోని రైతాంగం అంతా ఈ సబ్సిడీ జీలుగు విత్తనాల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణకు జూన్ 5న 'చలో హైదరాబాద్'

- నారాయణపేటలో 'విద్యా పరిరక్షణ కమిటీ' ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ
- బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి: టీపీటీఎఫ్ డిమాండ్
- తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల పేరుతో మిగతా పాఠశాలలను నిర్వీర్యం చేయొద్దు



**నారాయణపేట,(మనసులో మాట):** ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడుకోవడం కోసం మరియు విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ జూన్ 5వ తేదీన నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' మహా ధర్నా జయప్రదం చేయాలని విద్యా పరిరక్షణ కమిటీ తెలంగాణ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పలు డిమాండ్లతో కూడిన గోడ పత్రికను (పోస్టర్) కమిటీ నాయకులు ఆవిష్కరించారు.

## పేదలకు విద్య అందని ద్రాక్షగా మారింది

ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు రోజురోజుకు నిర్వీర్యం అవుతుంటే, ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని మండిపడ్డారు. దీనివల్ల విద్య అనేది ఖరీదైన వ్యాపారంగా మారి, పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా తయారైందని వాపోయారు. ఈ క్లిష్ట తరుణంలో ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడుకోవడం కోసం ప్రజాస్వామ్యవాదులు, పౌర సమాజం, విద్యావేత్తలు మరియు బుద్ధిజీవులు తమ గురుతర బాధ్యతగా భావించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## ఆ నిధుల అంతర్యం ఏమిటి?

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటిగ్రేటెడ్ మరియు 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల' పేరుతో సాధారణ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున పబ్లిక్ స్కూల్ కేటాయించి, మిగతా పాఠశాలలను వదిలేయడం తగదన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ పాఠశాలలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

## యూనివర్సిటీల వరకు సమస్యల వలయం

ప్రభుత్వ విద్యాసంస్థలకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని, కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడాలని ముఖ్యమంత్రి గారు పలు వేదికల మీద నుంచి పిలుపునిస్తున్నారని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. పాఠశాల స్థాయి నుండి యూనివర్సిటీల వరకు అనేక సమస్యలు పీడిస్తున్నాయని, బోధన సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణ లోపాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి కేటాయించిన రూ. 1000 కోట్ల నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని, అలాగే డైట్ (ఙ×జు), బీఈడీ కళాశాలల్లో గత కొన్నేళ్లుగా బోధన సిబ్బంది భర్తీ లేక తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వీటన్నింటిపై పోరాడేందుకు జూన్ 5న హైదరాబాద్‌లో జరిగే మహా ధర్నాలో విద్యావంతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## హాజరైన ముఖ్య నాయకులు

ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు పి. రామకృష్ణ, డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హైమవతి, సూర్యచంద్ర, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, సీఎల్సీ నాయకులు కాలేశ్వర్, టీపీటీఎఫ్ నాయకులు రామకృష్ణ, రాజేందర్, అరుణోదయ నాయకులు ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి మధు, ప్రకాష్, రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ కుల ధృవీకరణ పత్రాల దుర్వినియోగంపై విచారణ జరపాలి

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు 'టీఎంఆర్‌పీఎస్' వినతి
- తప్పుడు సర్టిఫికెట్లతో గ్రూప్-1 ఉద్యోగాలు పొందుతున్నారని ఆరోపణ
- కలెక్టర్‌తో మాట్లాడి న్యాయమైన విచారణ కమిటీ వేస్తాం: మంత్రి హామీ



**నిజామాబాద్ (మనసులో మాట):** మాదిగ కుల ధృవీకరణ పత్రాల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ గురువారం నిజామాబాద్ జిల్లాకు చెందిన పలు మాదిగ సంఘాల ముఖ్య నేతలు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ, టీఎండీ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకరాజు మాదిగ నేతృత్వంలో నిజామాబాద్ జిల్లా టీఎన్‌ఆర్‌పీఎస్ అధ్యక్షుడు మల్లని శివ మాదిగ, టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మారం అవిన్ మరియు జిల్లా కమిటీ సభ్యులు మంత్రిని కలిశారు. హక్కులను అక్రమంగా దక్కించుకుంటున్నారు ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. మాంగ్ కులానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఎస్సీ మాదిగ కుల ధృవీకరణ పత్రాలను పొందుతూ, అసలైన మాదిగలకు రావలసిన ప్రభుత్వ ప్రయోజనాలను అక్రమంగా దక్కించుకుంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ప్రతిష్ఠాత్మకమైన గ్రూప్-1 ఉద్యోగాల్లో కూడా తప్పుడు మాదిగ సర్టిఫికెట్లతో అవకాశాలు పొందుతున్నారని ఆరోపించారు. "లోక్‌సాహెర్ అన్న బహు సాటే మాదిగ సంఘం" పేరుతో కొందరు మాంగ్ కులస్తులు మాదిగలుగా చెలామణి అవుతూ ప్రభుత్వ ప్రయోజనాలను దుర్వినియోగం చేస్తున్నారని వివరించారు. దీనిపై గత నెల 27న జిల్లా కలెక్టర్‌కు కూడా వినతి పత్రం సమర్పించి, తప్పుడు కుల ధృవపత్రాలపై విచారణ జరిపేందుకు స్క్రూటినీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటాం: మంత్రి నేతల వినతిపై స్పందించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై ఒక న్యాయమైన విచారణ కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తప్పుడు ధృవపత్రాలు పొందిన వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్‌పీఎస్ టౌన్ నాయకులు పొందుర్తి జ్ఞానేశ్వర్, సంఘం నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం బీభత్సం.. రాళ్ల వానతో నల్లగొండలో అపార నష్టం



- ఈదురుగాలులకు ఎగిరిపోయిన ఆన్‌లైన్ సెంటర్ల పైకప్పు రేకులు
- కూలిన విద్యుత్ స్తంభాలు.. పట్టించుకోని విపత్తు నిర్వహణ బృందాలు
- సెలవు దినం కావడంతో తప్పిన పెద్ద ప్రమాదం.. ఆదుకోవాలని వ్యాపారుల డిమాండ్

**నల్లగొండ (మనసులో మాట):** నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ అకాల వర్షం ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు, జడివానతో పాటు పెద్ద ఎత్తున రాళ్ల వాన కూడా కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం సంభవించింది.

## రోడ్డుపై పడ్డ పైకప్పు రేకులు

భారీ గాలుల ధాటికి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న ప్రైవేట్ ఆన్‌లైన్ సెంటర్ల



పైకప్పుల రేకులు గాలికి లేచిపోయాయి. ఆ ఇనుప రేకులు ఒక్కసారిగా ఎగిరివచ్చి రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో ఆ ప్రాంతంలో కొంతసేపు భయానక వాతావరణం నెలకొంది. అదే విధంగా నగరంలోని పలుచోట్ల చెట్లు విరిగిపడటంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి, కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు సైతం నేలకూలాయి. ఈ భారీ గాలులు, రాళ్ల వాన కారణంగా రోడ్డు పక్కన ఉన్న చిన్న వ్యాపార సంస్థలు, షాపులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సహాయక చర్యల్లో జాప్యం.. స్థానికుల ఆవేదన అకాల వర్షం కారణంగా నగరంలో ఇంత భారీగా ఆస్తి నష్టం జరిగినప్పటికీ.. ఇప్పటివరకు డిజాస్టర్ మేనేజ్మెంట్ (విపత్తు నిర్వహణ) బృందాలు కానీ, 'ఆపదమిత్ర' టీములు కానీ సంఘటనా స్థలానికి చేరుకోలేదని క్షేత్రస్థాయిలో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై పడిపోయిన రేకులు, విరిగిన కొమ్మలను తొలగించడంలో అధికారులు జాప్యం చేయడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

## తప్పిన ప్రాణనష్టం

బక్రీద్ పర్వదినం సందర్భంగా సెలవు దినం కావడంతో ఆ సమయంలో రోడ్లపై జనసంచారం, వాహనాల రద్దీ చాలా తక్కువగా ఉందని, అందుకే ఒక పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లేదంటే భారీ ప్రాణనష్టం జరిగి ఉండేదని పేర్కొంటున్నారు. అకాల వర్షం వల్ల షాపులు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన చిన్న తరహా వ్యాపారులను, దుకాణదారులను ప్రభుత్వం తక్షణమే సర్వే చేసి ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్

పోచబోయిన సురేష్ యాదవ్



**ఎల్బీనగర్,( మనసులో మాట):** వనస్థలిపురం పానమా కామన్ వద్ద తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ అవార్డు గ్రహీత, నందమూరి తారక రామారావు 103 వ జయంతి వేడుకలలో మనసురాబాద్ కాంగ్రెస్ యువ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ పాల్గొని, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోచబోయిన సురేష్ యాదవ్ మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత ఎన్టీఆర్, ప్రజా సేవకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ తెలుగు ప్రజలు మరువలేనివని అన్నారు. తెలుగు ప్రజలలో ఓటర్ స్థాయి నుండి రాజకీయ చైతన్యాన్ని తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని సగర్వంగా చెప్పుకుంటున్నాము. తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మహానేత ఎన్టీఆర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూరెళ్ళ వేములయ్య గౌడ్, ఎన్టీఆర్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

ఇన్‌ఛార్జ్ ఏడీ ఎం.రూషేంద్రమణి



**మిర్యాలగూడ (మనసులో మాట):** రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల (ఎంఆర్‌పీ) కంటే ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) ఎం.రుషేంద్రమణి హెచ్చరించారు. పట్టణంలోని కొన్ని ఫర్టిలైజర్ దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు రావడంతో, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ ఆదేశాల మేరకు ఆమె గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పట్టణంలోని ఎంబీ అక్కయ్య ఎరువుల దుకాణం, విశ్వామిత్ర ఆగ్రో కెమికల్స్, వెంకటరమణ ఏజెన్సీస్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగింపు

### చాంపియన్ ప్రదీప్-11



**ఎండపల్లి(మనసులో మాట):** కొత్తపేట ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు ఉత్సాహంగా సాగి గురువారం ఘనంగా ముగిసింది. గ్రామ సర్పంచ్ జి.రెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్ ప్రదీప్-11, రాము-11 జట్ల మధ్య హోరాహోరీగా జరిగింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో ప్రదీప్-11 జట్టు విజేతగా నిలిచి తొలి బహుమతిని కైవసం చేసుకోగా, రాము-11 జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఉమ్మడి వెల్గటూర్ మండల ఎస్సై పి.ఉదయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విన్నర్, రన్నరప్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించడంతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ జి.రెడ్డి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ యువ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే టోర్నమెంట్ నిర్వహణ ముఖ్య లక్ష్యమన్నారు. గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి

### బీసీ విద్యార్థి సంఘం పగిడి జీడయ్య యాదవ్

**మిర్యాలగూడ (మనసులో మాట):** కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీఓ జారీ చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్, మాల మహానాడు విద్యార్థి విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్ డిమాండ్ చేశారు. గురువారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ స్కూళ్లు విద్యార్థుల నుండి లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చేశాయని వారు ఆరోపించారు. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినా నిబంధనలు ఉల్లంఘించి సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్నాయని, అయినా జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా కార్పొరేట్ యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీజుల నియంత్రణ చట్టాన్ని తేవాలని, ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన, మాల మహానాడు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# చివరి గింజ వరకూ కొంటాం.. రైతులను రెచ్చగొడితే సహించం

- బావురావుపేట ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- బాల్క సుమన్ చట్టవ్యతిరేక వ్యాఖ్యలపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్
- విధ్వంసాలు సృష్టించాలని చూస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక



**మంచిర్యాల,(మనసులో మాట):** రైతులు పండించిన వరి ధాన్యంలో చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, అన్నదాతలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి భరోసా ఇచ్చారు. గురువారం మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం బావురావుపేట గ్రామంలోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోళ్ల తీరుపై రైతులతో మాట్లాడి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన విద్వేషపూరిత, చట్టవ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

లక్ష్యానికి మించి ధాన్యం సేకరణ.. రవాణాకు 85 లారీలు ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో పంట దిగుబడి చాలా ఎక్కువగా వచ్చిందని మంత్రి వివేక్ తెలిపారు. రికార్డు స్థాయిలో కొనుగోళ్లు: గత ఏడాది జిల్లాలో కేవలం లక్షా 10 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు మాత్రమే జరిగితే.. ఈ ఏడాది ఇప్పటివరకు రికార్డు స్థాయిలో లక్షా 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందన్నారు. జూన్ 6 వరకు గడువు: రైతుల సౌకర్యార్థం జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. గోదాముల కేటాయింపు: ధాన్యం నిల్వ కోసం పెద్దపల్లి జిల్లాలో ప్రత్యేకంగా మూడు పెద్ద గోదాములను (గోడన్స్) అలాట్ చేయడం జరిగిందన్నారు. ప్రారంభంలో హమాలీల కొరత వల్ల కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని, అయితే ప్రస్తుతం రవాణాను వేగవంతం చేయడానికి సింగరేణి సంస్థ నుండి 40 లారీలను, మైనింగ్ శాఖ నుండి మరో 45 లారీలను (మొత్తం 85 లారీలు) కేటాయించామని వెల్లడించారు. ఈ లారీల ద్వారా ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తామన్నారు.

### ఓటమి ఫ్రస్ట్రేషన్‌లో బాల్క సుమన్ విధ్వంసకర రాజకీయం

కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతుంటే బీఆర్ఎస్ నాయకులు రాజకీయ స్వార్థంతో రైతులను అనవసరంగా రెచ్చగొడుతున్నారని మంత్రి వివేక్ మండిపడ్డారు. "గత ఎన్నికల్లో ప్రజలు బాల్క సుమన్‌ను ఘోరంగా ఓడించారు. ఆ ఫ్రస్ట్రేషన్‌లోనే ఇప్పుడు సమాజంలో విధ్వంసం సృష్టించాలని ఆయన చూస్తున్నారు" అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పిలుపునిస్తున్న ధర్నాలకు రైతులెవరూ రావడం లేదని బాల్క సుమన్ స్వయంగా ఒప్పుకున్నాడని, అందుకే కావాలనే తమ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి ఆందోళనలు చేయిస్తున్నారని ఆరోపించారు. సింగరేణి భవన్‌ను తగలబెట్టాలి, రైలు పట్టాలు కోసేయాలి అంటూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని బాల్క సుమన్ షో చేయాలని చూస్తున్నాడని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఎన్నికల్లో సుమన్ 100 కేసులు, 100 కోట్ల రూపాయలు ఖర్చు చేశాడని.. అన్ని వందల కోట్ల డబ్బులు ఆయనకు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు తెలుసన్నారు.

### కేటీఆర్ ఎందుకు నోరు విప్పడం లేదు?

నిత్యం చట్టం, రాజ్యాంగం గురించి మాట్లాడే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. బాల్క సుమన్ చేసిన చట్టవ్యతిరేక వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని మంత్రి వివేక్ డిమాండ్ చేశారు. సుమన్ గతంలో అరెస్ట్ అయితే జైలుకు వెళ్లి పరామర్శించిన కేటీఆర్.. ఇప్పుడు ఆయన బహిరంగంగా సింగరేణి భవన్ కాల్చాలి అనడంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అంటే బాల్క సుమన్ చేసిన విధ్వంసకర వ్యాఖ్యలను కేటీఆర్ సమర్థిస్తున్నారా? అని నిలదీశారు. గత బీఆర్ఎస్ హయాంలో మిల్లుల ముందు వందల లారీలు రోజుల తరబడి నిలిచిపోయేవని, ఇప్పుడు అలాంటి పరిస్థితి ఎక్కడా లేదన్నారు. లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కమీషన్లు నొక్కేసారే తప్ప, రైతులకు ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ వల్ల మునిగి నష్టపోయిన రైతులకు తానే స్వయంగా నష్టపరిహారం ఇప్పించానని గుర్తుచేశారు. రాజకీయాల్లో ఉన్నవారు సమాజానికి ఆదర్శంగా ఉండాలి తప్ప, ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి

- మిర్యాలగూడ కాలనీని పరిశీలించిన కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**నల్లగొండ,(మనసులో మాట):** మిర్యాలగూడ పట్టణంలోని శ్రీనివాస్ నగర్ గుమస్తాల కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కలెక్టర్ బి. చంద్రశేఖర్ మరియు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలు పరిశీలించారు. జూన్ 2 నాటికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందజేసేలా చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను కోరారు. అనంతరం మిర్యాలగూడ ఆర్‌డీఓ కార్యాలయంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై కలెక్టర్, ఎమ్మెల్యేలు సమీక్ష నిర్వహించారు. జూన్ 2న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నందున సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకులు, తాగునీటి ట్యాపులు, విద్యుత్ సౌకర్యాలు, కిటికీలకు గ్లాసులు, బాత్రూములు, ట్రాన్స్‌ఫార్మర్, స్ట్రీట్ లైట్లు తదితర అన్ని పనులను పూర్తి చేసి అప్పగించాలని, ఈ నెల 30వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పార్కులు, వాటర్ ప్లాంట్లు, గదుల శుభ్రత, సానిటేషన్, మరుగుదొడ్లు, మొక్కలు నాటడం, మిషన్ భగీరథ నీటి సరఫరా, ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీలు, పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి ఇంటికి నీటి ట్యాపులు, ఎలక్ట్రికల్ లైన్లు, పంప్ హౌస్‌లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే గుంతల రోడ్ల మరమ్మతులు మూడు రోజుల్లో పూర్తి చేయాలని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి లైన్లు పూర్తిచేయాలని, తాగునీటి ట్యాంకులను పూర్తిగా శుభ్రం చేయించాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కరెంట్, ఫ్యాన్లు, బోర్డుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో రమణారెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, హౌసింగ్ డీఈ శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రామకృష్ణ కలెక్టర్ వెంట ఉన్నారు.

# శాంతి, సామరస్యాలతో బక్రీద్ పండుగను జరుపుకోవాలి

- ఈద్గాల వద్ద బందోబస్తును స్వయంగా పరిశీలించిన జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- జిల్లావ్యాప్తంగా పటిష్ట భద్రతా చర్యలు.. అవాంఛనీయ ఘటనలపై ప్రత్యేక నిఘా



**జగిత్యాల,(మనసులో మాట):** పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముస్లిం సోదర, సోదరీమణులకు తన హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర పండుగను జిల్లా ప్రజలంతా శాంతి, సామరస్య వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రవక్త త్యాగాన్ని స్మరించే ఈ పండుగ ద్వారా పరస్పర ప్రేమాభిమానాలు, సహనం, సోదరభావం సమాజంలో మరింత బలపడాలని ఆయన కోరారు.

### ఈద్గాల వద్ద స్వయంగా పరిశీలన

బక్రీద్ నమాజ్ నిర్వహించే ప్రధాన ఈద్గాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. పరిస్థితుల సమీక్ష: జగిత్యాల, కోరుట్ల పట్టణాల్లోని పలు ఈద్గాలను సందర్శించిన ఆయన, అక్కడ భద్రతా పరిస్థితులను సమీక్షించి స్థానిక పోలీస్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

అధికారులకు ఆదేశం: పండుగ ప్రత్యేక ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణతో పాటు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పటిష్ట భద్రతా చర్యలు.. నిరంతర పెట్రోలింగ్

పండుగ సందర్భంగా జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లావ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ముఖ్య కూడళ్లు, ప్రార్థనా స్థలాల వద్ద అదనపు పోలీస్ బలగాలను మోహరించామని, సున్నిత ప్రాంతాలలో ప్రత్యేక సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతలను కాపాడాలని సూచించారు. బక్రీద్ వేడుకల నేపథ్యంలో జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో నిరంతరాయంగా పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతాయని ఎస్పీ వెల్లడించారు. ప్రజలు కూడా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎక్కడైనా ఎలాంటి అనుమానాస్పద విషయాలు లేదా వ్యక్తులు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఉమ్మడి జిల్లా సంస్కృతి అయిన మత సామరస్యాన్ని కాపాడుతూ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అనాథ శవానికి అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించిన సర్పంచ్

- మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన వెంకటాపూర్ సర్పంచ్ గంగాధర్
- బంధువులు లేక అనాథగా మారిన లక్ష్మీబాయి పార్థివదేహానికి పెద్దదిక్కుగా నిలబడ్డ వైనం

**కోరుట్ల,(మనసులో మాట):** ఈ రోజుల్లో పదవుల్లో ఉండి కేవలం రాజకీయం చేసే నాయకులు ఎక్కువవుతున్న వేళ.. కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ గంగాధర్ మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. గ్రామ అభివృద్ధి మాత్రమే కాదు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడటమే నిజమైన ప్రజాప్రతినిధి లక్షణమని ఆయన చేతల్లో నిరూపించారు.

### అనాథకు పెద్దదిక్కుగా నిలిచి..

వెంకటాపూర్ గ్రామానికి చెందిన న్యాంతాబాద్ లక్ష్మీబాయి ఆరెకటిక అనే వృద్ధురాలు మృతి చెందింది. అయితే ఆమెకు కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో శవం అనాథగా మారి, అంత్యక్రియలు జరపడం ఇబ్బందికరంగా మారింది.

సర్పంచ్ చొరవ: ఈ విషయం తెలిసిన వెంటనే గ్రామ సర్పంచ్ గంగాధర్ మానవత్వంతో స్పందించి తానే స్వయంగా ముందుకొచ్చారు.

అంత్యక్రియల నిర్వహణ: ఆ అనాథ శవానికి అన్నీ తానై పెద్దదిక్కుగా నిలిచి, గ్రామ ప్రజల సహకారంతో హిందూ సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియల బాధ్యతలు పూర్తి చేశారు.

### మిన్నంటిన గ్రామస్తుల ప్రశంసలు

సమాజంలో ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో చాలామంది పక్కకు తప్పుకునే తరుణంలో.. సర్పంచ్ గంగాధర్ చూపిన బాధ్యతాయుత వైఖరిపై వెంకటాపూర్ గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. పదవి అంటే కేవలం అధికారం చలాయించడం కాదని, ప్రజల కష్టసుఖాల్లో



తోడుగా నిలబడటమే అసలైన మహోన్నత సేవ అని ఆయన నిరూపించారని పలువురు కొనియాడారు. ఒక అనాథకు చివరి వీడ్కోలు చెప్పేందుకు ముందుకొచ్చిన సర్పంచ్ చొరవ స్థానికంగా అందరినీ కదిలించింది.

# నగరపాలక సంస్థ జవాన్‌కు రూ. 25 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**కరీంనగర్ (మనసులో మాట):** కరీంనగర్ నగరపాలక సంస్థలో అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న కమల్‌కు మంజూరైన రూ. 25 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ బుధవారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సాయం పేద ప్రజలకు, ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెనుకబడిన వర్గాలకు ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందుతుందని పేర్కొన్నారు. కష్టకాలంలో తమ సిబ్బందికి ఈ ఆర్థిక సాయం అందడం సంతోషకరమని, సాయం పొందిన పేద ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి,



సరిళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# త్యాగ సందేశాన్ని చాటిన బక్రీద్ పండుగ

**ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు**

**మత సామరస్యాన్ని చాటేలా గోవధ నిషేధం**

**ఘనంగా ఈద్-ఉల్-అధా వేడుకలు**



**ఎండపల్లి (మనసులో మాట):** త్యాగం, భక్తి, మానవత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్-ఉల్-అధా) పర్వదినాన్ని ఉమ్మడి వెల్గటూర్ మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ఆజ్ఞను శిరసావహిస్తూ తన కుమారుడిని సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడిన మహోన్నత ఘట్టాన్ని స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయాన్నే ముస్లిం సోదరులు సంప్రదాయ నూతన వస్త్రాలు ధరించి గుల్లకోట, శాఖాపూర్, అంబారిపేట, జగదేవ్‌పేట, పాతగూడూర్ గ్రామాల్లోని ఈద్గాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈద్ నమాజ్‌లో పాల్గొని దేశ ప్రజల శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాల కోసం దువా (ప్రార్థన) చేశారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు బక్రీద్ పర్వదిన విశిష్టతను వివరిస్తూ.. పవిత్ర ఖురాన్ బోధనలను అనుసరిస్తూ స్వార్థం, అసూయలను విడిచిపెట్టి ప్రేమ, సోదరభావంతో జీవించాలని పిలుపునిచ్చారు.

### మత సామరస్యానికి ప్రతీక:

ఈసారి బక్రీద్ ఖుర్బానీ సందర్భంగా మత సామరస్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో గోవధను పూర్తిగా నిషేధించి ముస్లిం సోదరులు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పారు. అన్ని మతాల పట్ల గౌరవభావం కలిగి ఉంటూ సామాజిక ఐక్యతకు కట్టుబడి ఉండాలని మత పెద్దలు సూచించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో ఉమ్మడి మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ రియాజ్, మహ్మద్ సలీం, ఇమామ్ మసూద్ అహ్మద్, సదర్ సాహెబ్‌తో పాటు ముస్లిం మత పెద్దలు ఫకీరోద్దీన్, రఫీ, తాజ్, అనీఫ్, అల్లీ సాబ్, నసీరుద్దీన్, అబ్దుల్లా, హఫీజ్, రహీం, సయ్యద్ హైదర్, సాదుల్లా, ముస్తఫా, శుక్రోద్దీన్, అప్సర్, నసర్, నసీర్, బాబర్, అసీఫ్, రషీద్, జానీ, ముబారక్, పాషా, అజహరుద్దీన్, అజ్మత్, హుస్సేన్, దస్తగిరి, షరీఫ్, ఫకీర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి హామీతో కాల్వ మరమ్మతులు

**సర్పంచ్ శ్రీనివాస్**

**గన్నేరువరం(మనసులో మాట):** గన్నేరువరం మండలంలోని మాదాపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కాల్వ మరమ్మతు పనులను సర్పంచ్ మాదరి శ్రీనివాస్ గురువారం అధికారికంగా ప్రారంభించారు. గ్రామంలోని డి-9 వన్ ఎల్ (డి9 1ఎ) కెనాల్ వద్ద ఈ పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాదరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాల్వలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడిక మట్టిని తొలగించడం ద్వారా గ్రామ రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలు కొలతల ప్రకారం పనులు నిర్వహించి అత్యధిక వేతనం పొందాలని ఆయన సూచించారు. అలాగే పనులు జరిగే ప్రదేశంలో కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని క్షేత్రస్థాయిలోని సీనియర్ మేట్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కళ్లెం అనితతో పాటు అధిక సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీ భక్తాంజనేయ భజన మండలికి ప్రథమ బహుమతి



**శంకరపట్నం (మనసులో మాట):** హన్మకొండ జిల్లా నడికుడ మండలం చెర్లపల్లె గ్రామంలో స్వర్గీయ గరిడె సుగుణ గారి జ్ఞాపకార్థం నిర్వహించిన భజన పోటీలలో శంకరపట్నం మండలం కరీంపేట గ్రామానికి చెందిన 'శ్రీ భక్తాంజనేయ భజన మండలి' ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు భజన మండలి సభ్యులకు మెమెంటోతో పాటు రూ. 6,000 నగదు బహుమతిని అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. తమ గ్రామానికి చెందిన భజన బృందం జిల్లా దాటి వెళ్లి ప్రథమ స్థానంలో నిలవడంపై కరీంపేట గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ భజన పోటీలలో పాల్గొన్న వారిలో ఆడెపు శ్రీనివాస్, గంపల బాలరాజు, సంబు శ్రీనివాస్, మెడిశెల్మల శ్రీనివాస్, రాసమల్ల శ్రీనివాస్, మేర్గు రాజు, ఏగుర్ల సంపత్, చింతం రవి, సంబు తిరుపతి, బిట్టు తదితరులు ఉన్నారు.

## రైతులు ఆందోళన చెందవద్దు

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్(మనసులో మాట):** ఐపీఎం (వరి) ధాన్యం చివరి గింజ వరకూ కొంటామని, రైతులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్ మండలం నగునూర్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఐలాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలపై అక్కడికక్కడే స్పందించిన సుడా చైర్మన్.. వెంటనే ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ధాన్యం నిల్వలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక గోదాములను కేటాయించాలని, వారంలోగా నగునూర్ కొనుగోలు కేంద్రంలో సేకరణ పూర్తి చేసి సెంటర్ ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా రైతు పక్షపాతి అని, ఏ ఒక్క రైతుకూ నష్టం జరగనివ్వబోమని భరోసా ఇచ్చారు. వాహనాలు, హమాలీల కొరత వల్ల అక్కడక్కడ కొంత రవాణా ఆలస్యమై ఇబ్బంది కలుగుతున్న మాట నిజమేనని, అయితే ఈ సమస్యను అధిగమించి వేగంగా కొనుగోళ్లు జరుపుతామన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నా రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచాల లక్ష్మణ్ రావు, ఉప సర్పంచ్ హన్మంత రావు, సెంటర్ ఇంచార్జి అజయ్, అశోక్ రెడ్డి, కృష్ణా రెడ్డి, సాయిల్ల రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన గింజనూ కొంటాం.. రైతన్నా ధైర్యంగా ఉండు!

- దేశంలోనే రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఎద్దపల్లిలో నలుగురు మంత్రుల ఆధ్వర్యంలో 'ధాన్యం' సమీక్ష
- బీజేపీ విమర్శలు విడ్డూరం.. లారీల కొరత తీర్చేందుకు ఇసుక క్వారీల బంద్ కు ఆదేశం



**పెద్దపల్లి(మనసులో మాట):** రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో రైతాంగం పండించిన వరి ధాన్యంలో చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకే సేకరించి బాయిల్డ్ మిల్లులకు తరలిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పెద్దపల్లి జిల్లాలో మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం, జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రుల బృందం సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించింది.

### రికార్డు స్థాయిలో రూ. 11వేల కోట్ల చెల్లింపులు..

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సామాన్య రైతులకు ఇబ్బంది కలగకుండా 8,885 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. యాసంగిలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, మరో 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని వివరించారు. ఇప్పటివరకు 8 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 11,000 కోట్లను జమ చేశామని మంత్రి పేర్కొన్నారు.



### కేంద్రం కంటే రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువ సేకరించింది!

ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ నాయకులు చేస్తున్న ప్రచారం విడ్డూరంగా ఉందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో రాష్ట్రంలో మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తే.. అందులో కేంద్రం వాటా కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనని గుర్తుచేశారు. మిగిలిన 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా కొనుగోలు చేసిందని ఆయన స్పష్టం చేశారు. డిసెంబర్ 2023 తర్వాత కేంద్ర మద్దతు ధరకు అదనంగా ఏకంగా రూ. 16,470 కోట్లు వెచ్చించి రైతన్నలకు అండగా నిలిచామని మంత్రి వివరించారు.

### ధాన్యం రవాణా కోసం 'ఇసుక లారీలు'..

ధాన్యం తరలింపులో లారీల కొరత రాకుండా ఉండేందుకు మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు జిల్లాలోని ఇసుక క్వారీలను తక్షణమే నిలిపివేసి, ఆ ఇసుక లారీలను ధాన్యం రవాణా కోసం ఉపయోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి జిల్లాలో ధాన్యం సేకరణను వేగవంతం చేయడంలో చొరవ చూపిన అధికారులు, మిల్లర్లు, ప్రజాప్రతినిధులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ కెనాల్ 'యూటీ'కి గండం..

- కుప్పకూలితే రైతన్నకు తీరని నష్టం!
- సిసి బెడ్ కింద ఏర్పడ్డ ప్రమాదకర సొరంగం
- ఇసుక అక్రమ తవ్వకాలే శాపమా?..
- లీకేజీతో తేలిన బండరాళ్లు
- వర్షాకాలం ముంచుకొస్తోంది.. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని రైతుల డిమాండ్



**శంకరపట్నం(మనసులో మాట):** మండలంలోని కరీంపేట శివారులో గల కాకతీయ కెనాల్ యూటీ (అండర్ టన్నెల్) వద్ద భారీ ప్రమాదం పొంచివుంది. ఎగువ నుండి వచ్చే వరద తాకిడికి ఇక్కడి రక్షణ నిర్మాణం కొట్టుకుపోయే స్థితికి చేరడంతో స్థానిక రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. అధికారులు సకాలంలో స్పందించి మరమ్మతులు చేపట్టకపోతే, రాబోయే వర్షాకాలంలో ఇక్కడి ఆయకట్టుకు భారీ నష్టం వాటిల్లేలా కనిపిస్తోంది.

### వరద ప్రవాహం.. ఇసుక తవ్వకాల దెబ్బ!

చిగురుమామిడి మండలంలోని రేకొండ చెరువు మత్తడి గుండా వచ్చి, శంకరపట్నం మండలం ముత్తారం దిగువకు వెళ్లే వాగు నీరు.. కరీంపేట శివారులోని కాకతీయ యూటీ గుండా ప్రవహిస్తుంది. ఈ క్రమంలో ఎగువన ఉన్న భూమి వరద తాకిడికి కోతకు గురికాకుండా ఉండేందుకు గతంలో ఇక్కడ బండరాళ్లతో రక్షణ గోడ నిర్మించి, దానిపై సిమెంట్ కాంక్రీట్ (జజ) బెడ్‌ను వేశారు. అయితే, ఇటీవల కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ సిసి బెడ్ ఎగువన ఉన్న ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేయడంతో అసలు సమస్య మొదలైంది.

### ఏర్పడ్డ సొరంగం.. లీకేజీల భయం!

ఇసుకను తరలించడంతో బెడ్ కింద ఉన్న బండరాళ్లు బయటపడ్డాయి. దీనివల్ల ఎగువ నుండి వచ్చే వరద నీరు సిసి బెడ్ పైనుండి సాఫీగా వెళ్లకుండా, కింద తేలిన బండరాళ్ల మధ్య నుండి లీక్ అవుతోంది. ఈ నిరంతర లీకేజీల కారణంగా సిసి బెడ్ కింద ప్రమాదకరంగా ఒక పెద్ద సొరంగం (గుల్ల) ఏర్పడింది.

### పంట పొలాలు కోతకు గురయ్యే ప్రమాదం..

ప్రస్తుతం రోహిణి కార్తె ప్రవేశించి, వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో ఎగువ నుండి వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగితే.. ఈ బలహీనపడిన సిసి బెడ్ నిర్మాణం పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఒకవేళ ఇదే జరిగితే ఎగువన ఉన్న వాగుతో పాటు చుట్టుపక్కల ఉన్న వందలాది ఎకరాల పంట పొలాలు భారీగా కోతకు గురవుతాయని, తాము కోలుకోలేని విధంగా నష్టపోతామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎస్సారెస్పీ (SRSP), ఇరిగేషన్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి, లీకేజీలను అరికట్టి సిసి బెడ్‌కు తక్షణ మరమ్మతులు చేపట్టాలని చుట్టుపక్కల గ్రామాల రైతులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ





**ఇల్లంతకుంట(మనసులో మాట):** మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం వెల్జీపూర్ గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన పలువురి కుటుంబ సభ్యులను మానకొండూర్ శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారు గురువారం పరామర్శించారు. ఆయా బాధిత కుటుంబాలను నేరుగా కలిసి వారిని ఓదార్చిన ఎమ్మెల్యే, మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, అధైర్యపడకుండా మనోధైర్యంతో ఉండాలని సూచించారు. బాధిత కుటుంబాలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలన కోసం తైక్వాండో బాలికల వినూత్న ప్రచారం



**కోనరావుపేట(మనసులో మాట):** మండల కేంద్రంలోని సన్‌రైజ్ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో బాలికలు డ్రగ్స్, మత్తుపదార్థాల అనర్థాలపై వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ స్వయంగా చిత్రాలు (డ్రాయింగ్స్) వేసిన బాలికలు.. తైక్వాండో స్టైల్‌లో కిక్స్, స్ట్రెచింగ్, బ్యాలెన్సింగ్ ప్రదర్శిస్తూ ఆ పోస్టర్లను పట్టుకుని ప్రచారం చేయడం అందరినీ ఆకట్టుకుంది. బాలికలు తయారుచేసిన పోస్టర్లలో "యువత మేలుకో.. డ్రగ్స్ వదులుకో", "డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం.. భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దాం", "పొగతాగుట హానికరం" వంటి నినాదాలతో కూడిన బొమ్మలను గీశారు. ఈ సందర్భంగా బాలికలు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సైతం యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండవచ్చని, డ్రగ్స్ నిర్మూలనలో అధికారులకు మద్దతుగా ఈ ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఆటలతో అలవాట్లు మారుతాయి: తైక్వాండో కోచ్ శ్రీనివాస్డ్రగ్స్ నిర్మూలన కోసం పోలీసులు చేస్తున్న ప్రయత్నాలకు తమ వంతు సహాయంగా ఈ కార్యక్రమం చేపట్టామని తైక్వాండో కోచ్ శ్రీనివాస్ చెప్పారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉండాలంటే ఆటలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడలపై శ్రద్ధ పెరిగితే మత్తు పదార్థాల ఆలోచనే రాదన్నారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో సమ్మర్ క్యాంపుల ద్వారా తైక్వాండో శిక్షణ ఇస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను పంపితే ఆత్మరక్షణ, ఆరోగ్యంతో పాటు చెడు అలవాట్లకు దూరంగా ఉంచవచ్చని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని ఆయన పిలుపునిచ్చారు.

# వైద్య నిపుణుల నియామకానికి చర్యలు

## సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్

**మంచిర్యాల(మనసులో మాట):** మంచిర్యాల్ జిల్లా బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి అన్నివిధాల కృషిచేస్తున్నట్లు సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి బెల్లంపల్లి సింగరేణి ఏరియాఆసుపత్రి ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వార్డులు, క్యాజ్ వాలిటీ ల లో తనిఖీ చేశారు. ఆ తర్వాత వైద్యులు, సిబ్బంది తో మాట్లాడారు. కొద్ది రోజుల్లోనే బెల్లంపల్లి ఆసుపత్రి లో వైద్య నిపుణులు, తగిన సిబ్బందిని నియమించేందుకు కృషిచే స్తున్నట్లు స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సౌకర్యార్థం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో కాడ్యాలజీ క్యాట్ లాక్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి నుంచి భూపాలపల్లి వరకు గల కార్మికులు,వారికుటుంబాలు మొత్తం 1.80 లక్షల మందికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. సింగరేణి లో ఖాళీ గా ఉన్న వైద్యుల, సిబ్బంది పోస్టులు భర్తీ చేసేందుకు సింగరేణి యజమాన్యం నిర్ణయం తీసుకుందాన్నారు. దీంతో 32 మంది వైద్యులను175 మంది పోస్టులు భర్తీ చేసేందుకు ఇప్పటికే ఇంటర్వ్యూలు కూడా నిర్వహించామని వెల్లడించారు. కార్మిక సంఘాల అభ్యర్థన మేరకు త్వరలో నియామకాలు చెపట్టనున్నట్లు సీ ఎం వో స్పష్టం చేశారు. బెల్లంపల్లి కి ప్రతి నెల లో ఆరుగురు వైద్య నిపుణులు, వారానికి ఒక రోజు క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. త్వరలో గుండె, కంటి వైద్య నిపుణులు వచ్చి నెలలో రెండు రోజులు క్యాంపు నిర్వహించి కార్మికులకు, వారి కుటుంబాలకు వైద్య సేవలు అందిస్తారని వివరించారు.ఆయన వెంట బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి డీవైసీఎంవో పాండు రంగ చారీ ఉన్నారు.



# త్యాగానికి మారుపేరు బక్రీద్ పండుగ

## ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు!

## మత సామరస్యాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పిన మౌలానా ఇంతెషా ఆలం ప్రసంగం

## వేడుకల్లో పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

**కొమురం భీం ఆసిఫాబాద్,(మనసులో మాట):** త్యాగం, భక్తి, విశ్వాసం మరియు మానవత్వానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్-ఉల్-అధా) పర్వదినాన్ని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లావ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని చింతగూడ పోయావాగు ఈద్గాతో పాటు జిల్లాలోని అన్ని ప్రముఖ ఈద్గాలు, మసీదులు గురువారం ముస్లిం జనసందోహంతో పోటెత్తాయి. ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ఆజ్ఞను శిరసావహిస్తూ తన ప్రియపుత్రుడైన హజ్రత్ ఇస్మాయిల్‌ను సైతం దైవమార్గంలో త్యాగం చేసేందుకు సిద్ధపడిన మహోన్నత చారిత్రాత్మక ఘట్టాన్ని స్మరించుకుంటూ ముస్లింలు ఈ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని గురువారం ఉదయాన్నే 7 గంటల 30 నిమిషాలకే ముస్లిం సోదరులు సంప్రదాయబద్ధంగా స్నానమాచరించి, నూతన వస్త్రాలు ధరించి, శిరస్సుపై టోపీలతో ఈద్గాల వద్దకు భారీగా తరలివచ్చారు. చిన్నారుల నుండి వృద్ధుల వరకు అందరూ ఒకే వరుసలో నిలబడి భక్తిశ్రద్ధలతో ఈద్ నమాజ్‌లో పాల్గొన్నారు. నమాజ్ అనంతరం దేశ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతృప్తులు వర్ధిల్లాలని దైవాన్ని ప్రార్థిస్తూ ప్రత్యేకంగా 'దుఆ' చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మత సామరస్యాన్ని పరిరక్షించాలి: జామా మస్జిద్ ఇమామ్ ఈ సందర్భంగా జామా మస్జిద్ ఇమామ్ మౌలానా ఇంతెషా ఆలం బక్రీద్ పర్వదిన విశిష్టతను వివరిస్తూ ప్రసంగించారు. త్యాగనిరతి, దయ, కరుణ, సేవాభావం, మానవత్వం వంటి ఉత్తమ విలువలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆచరించాలని సూచించారు. పవిత్ర ఖురాన్ బోధనలను అనుసరిస్తూ స్వార్థం, అసూయ, రాగద్వేషాలను పూర్తిగా విడిచిపెట్టి.. ప్రేమ, సోదరభావం, పరస్పర గౌరవంతో సమాజంలో జీవించాలని పిలుపునిచ్చారు. మహ్మద్ ప్రవక్త చూపిన సన్మార్గంలో నడుస్తూ సత్ప్రవర్తనతో జీవనం సాగించాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ ఇచ్చే క్రమంలో మత సామరస్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో గోవధను పూర్తిగా నిషేధించి భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాలని ముస్లింలకు దిశానిర్దేశం చేశారు. అన్ని మతాల పట్ల గౌరవభావం కలిగి ఉంటూ సామాజిక ఐక్యతకు కట్టుబడి ఉండాలని మత పెద్దలు స్పష్టం చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఈ వేడుకలు మున్సిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, వార్డ్ కౌన్సిలర్ నియాజుద్దీన్ (బాబా)ల ప్రత్యేక పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ పవిత్ర వేడుకల్లో కాగజ్‌నగర్ మాజీ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) కోనేరు కోనప్ప ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులకు ఆలింగనం చేసుకుని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుభాన్ ఖాన్, ఎం.ఏ. వసీం, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముస్లిం సోదరులకు తమ పండుగ అభినందనలు అందజేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు, కాగజ్‌నగర్ పట్టణ ప్రజలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఎన్టీఆర్ ఆశయాలు, సీఎం చంద్రబాబు బాటలో నడుద్దాం

## ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**నందికొట్కూరు (మనసులో మాట):** తెలుగు ప్రజల గుండెల్లో చెదరని ముద్ర వేసిన మహోన్నత వ్యక్తి నందమూరి తారకరామారావు అని, ఆయన ఆశయాలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో మనమంతా ముందుకు నడవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌ఛార్జ్ మాండ్ర శివానందరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నందికొట్కూరు పట్టణ బ్రాహ్మణకొట్కూరు క్లస్టర్ల ఆధ్వర్యంలో పసుపు పండుగ 'మహానాడు' రెండో రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన 103వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. అన్నగారు ఎన్టీఆర్ పేదలకు కూడు, గూడు, గుడ్డతో పాటు మహిళలకు ఆస్తి హక్కు కల్పించి ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, ఆయన తెచ్చిన కీర్తి వల్లే ఈరోజు తెలుగువారంతా గర్వంగా తిరుగుతున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అబ్జర్వర్ వెంకట శివుడు యాదవ్, మండల కన్వీనర్ మాండ్రా సురేంద్రనాథ్ రెడ్డి, వీరం ప్రసాద్ రెడ్డి, హరి సర్వోత్తమ్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, బూత్ ఇన్‌ఛార్జీలు, టీడీపీ నాయకులు మరియు మహిళలు పాల్గొన్నారు.

# నంద్యాల పోలీస్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

## ఎస్పీ సునీల్ షొరాణ్

**నంద్యాల జిల్లా (మనసులో మాట):** తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారకరామారావు 103వ జయంతి వేడుకలను నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తెలుగుజాతికీ, తెలుగుభాషకూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహోన్నత వ్యక్తి అని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని కొనియాడారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా ప్రజాసేవకుడిగా, నటుడిగా ఆయన అందించిన సేవలు అపారమన్నారు. స్త్రీలకు ఆస్తిలో సమాన వాటా చట్టం తెచ్చిన ఘనత ఆయనదేనని, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్. యుగంధర్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు బాబు, సురేష్, ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది మరియు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




# బీజేపీ శ్రేణుల శిక్షణా తరగతులు!

- ప్రారంభోత్సవానికి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు,
- ముగింపునకు కేంద్రమంత్రి బండి సంజయ్ రాక
- శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల వేదికగా
- 'పండిత్ దీన్ దయాళ్ మహా అభియాన్'
- తరగతులను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపు



**తిమ్మాపూర్, (మనసులో మాట):** భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు సిద్ధాంతపరమైన అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన 'పండిత్ దీన్ దయాళ్ ప్రశిక్షణా మహా అభియాన్' కరీంనగర్ జిల్లా శ్రేణుల శిక్షణా తరగతులు ఈనెల 30, 31 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల వేదికగా రెండు రోజుల పాటు సాగనున్న ఈ శిక్షణా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం వివిధ విభాగాలకు సంబంధించి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లకు సంబంధించి గురువారం శిక్షణా తరగతుల వేదిక ప్రాంగణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నేతలు, వివిధ విభాగాల బాధ్యులతో కీలక సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సాగుతున్న ఈ ప్రశిక్షణా మహా అభియాన్ ద్వారా పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపనున్నట్లు తెలిపారు.

ముఖ్యంగా పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన సమగ్ర మానవతావాదం, సమాజంలో చిట్టచివరి వ్యక్తికి సైతం సంక్షేమ ఫలాలు అందాలనే అంత్యోదయ సిద్ధాంతాలపై ఈ తరగతుల్లో విస్తృత అవగాహన కల్పిస్తారని కృష్ణారెడ్డి వివరించారు. వీటితో పాటు కిందిస్థాయిలో బూత్ నిర్వహణ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకువెళ్లే వ్యూహాలు, సోషల్ మీడియా వినియోగం మరియు సంస్థాగత బాధ్యతలపై కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా కార్యకర్తల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవా భావాన్ని పెంపొందించి పార్టీ విస్తరణకు బాటలు వేస్తామన్నారు. ఈనెల 30న జరిగే శిక్షణా తరగతుల ప్రారంభోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, 31న జరిగే ముగింపు (సమారోప్) సభకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారని వెల్లడించారు. జిల్లాలోని పార్టీ అపేక్షితులు (ప్రతినిధులు) అందరూ ఈ శిక్షణకు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సన్నాహక సమావేశంలో బీజేపీ జిల్లా ప్రశిక్షణ కన్వీనర్ మాడ వెంకట్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, సంచలన సమితి ప్రముఖ్ గుజ్జ శ్రీనివాస్, కార్యక్రమ ప్రముఖ్ కళ్ళెం వాసుదేవ రెడ్డి, వ్యవస్థ ప్రముఖ్ ఇనకొండ నాగేశ్వర్ రెడ్డి, సహ ప్రముఖ్ చింతం శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే వివిధ విభాగాల ప్రముఖులు, ప్రబంధకులు బోంతల కళ్యాణ్ చంద్ర, సుగుర్తి జగదీశ్వర చారి, కనుమల్ల గణపతి, దండు కొమురయ్య, రంగు భాస్కరాచారి, పుష్పాల రఘు, అడిచేర్ల రాజు, బండ రమణ రెడ్డి, గుంజేటి శివకుమార్, పైడిపల్లి శ్రీనివాస్, రామిడి మహేందర్ రెడ్డి, బుట్ల శ్రీనివాస్, మావురపు సంపత్, వేల్పుల ఓదెలు, గడ్డం అరుణ, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, కన్నం సాయి, అలివేలు సమ్మిరెడ్డి, దాసరి రమణారెడ్డి, కనుగంటి మధుకర్ రెడ్డి, దూలం కిరణ్, గుర్రాల వెంకటరెడ్డి, బోనాల మోహన్, తనకు సాయి, అన్నాజీ వినీత్ కుమార్, ప్రఫుల్, జి. వినోద్, కడార్ల విమల్ కుమార్, జయంత్, కాల్వ శ్రీనివాస్, వి. ప్రవీణ్, రాపాక ప్రవీణ్, కొట్టాల శ్రీనివాస్, జక్కోజు అనిల్ కుమార్, బూడిద అశోక్, రమేష్, అందేశేఖర్, దుర్శెట్టి అజయ్, దురిశెట్టి రమేష్, ఎర్రోజు లక్ష్మణ్, సంఘ నరేష్, చల్లూరి శ్రీధర్, బుర్ర శ్రీనివాస్, జాడి రాజు, ప్రదీప్ రెడ్డి, రవీందర్ యాదవ్, ఆకుల అనిల్, జంగ సునీల్ రెడ్డి, పి. కృష్ణ కిషోర్, కొయ్యడ శ్రీనివాస్, గొల్లపల్లి మల్లేశం, పబ్బ తిరుపతి, కసాడి సంపత్, సుగుణాకర్, సంతోష్‌లతో పాటు మహిళా విభాగానికి చెందిన గుర్రాల నిర్మలారెడ్డి, చొప్పరి జయశ్రీ, ఆవుల కీర్తి, చింతం వరలక్ష్మి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు తరలించాలి

## అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**వేములవాడ (మనసులో మాట):** రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులు, గోదాములకు తరలించేలా అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని, దీని కోసం సంబంధిత ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గురువారం ఆయన వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల, ఫాజుల్ నగర్, అలాగే బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు కోరెం, బూరుగుపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద జరుగుతున్న కొనుగోళ్ల తీరును పరిశీలించి, నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు.

అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. రైతులు



తెచ్చిన ధాన్యాన్ని ఏరోజుకారోజు తూకం వేసి తరలించాలని, క్షేత్రస్థాయిలో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసినప్పటికీ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకూ సేకరిస్తామని రైతులకు భరోసా కల్పించాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని లారీల ద్వారా త్వరగా లోడింగ్ చేయడం కోసం అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచుకుని కొనుగోళ్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.